ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్

ఆంధ్రపత్రిక

వ్యవస్థాపకులు: దేశోద్ధారక విశ్వదాత శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

# మూలభాష మిగిలేనా?

సంస్కృతం భరత జాతి సంపద. భారత జాతీయ భాషగా ప్రకటించండంటూ న్యాయ స్థానాల చుట్టూ తిరగాల్సి రావడమే విషాదం. ఈ అంశంపై సుప్రీంకోర్టులో ఆ మధ్య ఓ ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం దాఖలైంది. దీనిని అప్పుడే సుప్రీం కోర్టు కొట్టేసింది. "దీనికి రాజ్యాంగ సవరణ అవసరం. ఇది పాలసీలకు సంబంధించిన విషయం. దీనిని మేం మార్చలేం. దీనిపై చర్చించడానికి సరియైన వేదిక పార్లమెంట్" అనిసుప్రీం ధర్మాసనం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. హిందీతో పాటు సంస్కృతాన్ని కూడాజాతీయ భాషగా పేర్కొనాలని గుజరాత్ మాజీ అదనపు సెక్రటరీకెజి వంజార పిల్ వేశారు. సంస్కృత ఉచ్చారణలో జీవశక్తి ఉంటుందని, మెదడు చురుక్కుగా పనిచేయడానికి ఉపయోగపడుతుందని, లయబద్ధమైన ఉచ్చారణ వల్ల పిల్లల్లో జ్ఞాపకశక్తి కూడా పెరుగుతుందన్నది ఆయన వాదన. సంస్కృతాన్ని జాతీయ భాషగా చేయడం వల్ల హిందీ, ఇంగ్లీష్ భాషలకు వచ్చే నష్టం ఏమీ లేదని ఆయన భావం. వంజార ఆలోచనలు, ఆశయం అభినందనీయం. లోక్ సభ చర్చలు, ప్రతి చర్చల్లోని రాజకీయ కోణాలు ఎలా ఉన్నా, మనదైన గొప్ప భాషకలకాలం మన్నడానికి ప్రతి ఒక్కరూ సహకరించడమే సహేతుకం. అవసరార్థం, బతుకు తెరువు కోసం ఇంగ్లిష్ భాష అత్యవసరమైననేటి కాలంలో, స్థానిక భాషల ప్రస్థానం ప్రశ్నార్థకంగా మారింది. బ్రిటిష్ పాలనలోలార్డ్ మెకాలే రుద్దిన విద్యా విధానం వల్ల మనం చాలా నష్టపోయాం. వాటిల్లో మన భాషలుకూడా ఉన్నాయి. 'త్రిభాషా సూత్రం' చాలా కాలం చాలా రాష్ట్రాల్లో బాగానే అమలయ్యింది. తమిళనాడు వంటి కొన్ని చోట్ల హిందీ విషయంలోతీవ్ర వ్యతిరేకత వచ్చింది. భాషాభిమనం ఆహ్వానించ తగినదే. దురాభిమానమే కొంపలు ముంచుతుంది. ఈ తీరు వల్లఆ యా రాష్ట్రాల్లో జీవించే అన్యభాషీయులకు పెద్ద అన్యాయం జరుగుతోంది. మాతృభాష /స్థానిక భాష, దేశంలో ఎక్కువమంది మాట్లాడే హిందీ, ప్రపంచభాషగా చెలామణి అవుతున్న ఇంగ్లిష్... ఇలా మూడు భాషలుచదవడం వల్ల ఎంతో ప్రయోజనం ఉందని భాషా శాస్త్రవేత్తలు కూడా అనేకమార్లు చెప్పారు. అందులో నిజముందని నమ్మవచ్చు. కొన్ని విద్యాలయాలలో ఇంగ్లిష్ తో పాటు కొన్ని విదేశీ భాషలు కూడా అందుబాటులో ఉన్నాయి. బహుభాషలు నేర్చుకోవడం తప్పేమీ కాదు. పైగా ఎన్నో ప్రయోజనాలు కూడా ఉన్నాయి. అదే సమయంలో, మనదైన సర్వ విజ్ఞానమంతా నిక్షిప్తమై ఉన్న సంస్కృతాన్ని కూడా తప్పకుండా చదవాలి. అత్యంత ప్రాచీనమైన మన భాషను కాపాడుకోవడంతో పాటుమన ప్రాచీన జ్ఞాన సంపద మళ్ళీ మనకు దగ్గరవుతుంది. మనదేశంలో సంస్కృతం చదివేవారి సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. మార్కుల స్కోరింగ్ నెపంతో కొందరు విద్యార్థులు మాతృభాషను వీడి సంస్కృతం వైపు మొగ్గు చూపిస్తున్నారు. ఇది కేవలం మార్కుల మీద ప్రేమ తప్ప భాషాభిమానం కాదు. ఈ ఆలోచనా విధానంవిద్యా విధానాల లోని లోపాల వల్ల మాత్రమే వచ్చింది. ఇంగ్లిష్ భాషను నేర్చుకోవడం వల్ల ఎన్నో పుస్తకాలు చదవగలుగుతున్నాం, అర్థం చేసుకోగలుగుతున్నాం, పది దేశాలు తిరిగి నెట్టుకు రాగలుగుతున్నాం. అదే స్ఫూర్తి సంస్కృత భాషను అధ్యయనం చేయడంలోనూ చూపిస్తే? గొప్ప జ్ఞానం అబ్బిజీవశక్తి ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతుందని పెద్దలు చెప్పిన మాటలు సత్యవాక్కులు. దేశంలోని వివిధ విద్యాలయాల లోని కోర్సుల్లో ఉండే సంస్కృతం విషయంలో పరీక్షలు రాసే సమయంలో ఎక్కువ మంది ఎక్కువ శాతం సంస్కృతం కంటే ఇంగ్లిష్ లేదా మాతృభాష / స్థానిక భాషలను ఎంచుకుంటున్నారు. 'దేవనాగరి' లిపిని ఎంచుకుంటేనే సంస్కృత భాషా పరంగా సంపూర్ణమైన న్యాయం జరుగుతుంది, ప్రయోజనం సిద్ధిస్తుందని చెప్పవచ్చు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా ఈ విషయాన్ని పదే పదే గుర్తుచేస్తున్నారు కానీ ఆచరణలో అది జరగడం లేదు. దీనిపై కేంద్రంతో పాటు ,రాష్ట్ర ప్రభుత్వాలు కూడా నిబద్ధతతో దృష్టి సారించాలి. మన జ్ఞానమంతా వేదాల్లోనే ఉందని కదా మన పెద్దలు చెప్పారు. మన శాస్త్రాలన్నీ మొన్నటి వరకూ సంస్కృతంలో ఉన్నాయని కదా వారి వాదన. మన దేశాన్ని దురాక్రమించిన అనేక దేశస్తులుమన సంపదతో పాటుమన వేద సర్వస్వాన్నిపట్టుకెళ్ళిపోయి, మనవారితోనేఆ విశేషాలు తెలుసుకొని వారి భాషల్లోకి అనువదించుకున్నారనే వేదనామయమైన వాదనలు మనకు తరచూ వినపడుతూ ఉంటాయి. మన శాస్త్రాలు చదివి, రహస్యాలు తెలుసుకొని తిరిగి మనకే వాటిని అమ్మే దుస్థితులు వచ్చాయన్నది సంప్రదాయవాదుల వేదన. ఇటువంటి దుస్థితిలోనూ మన దేశంలో ఇప్పటికీ సంస్కృతం మాట్లాడేవారు ఉండి ఉండడంమన అదృష్టం. కర్ణాటకలోని మత్తూరు అనే గ్రామంలో అందరూ పూర్తిగా సంస్కృతంలోనే మాట్లాడుతారు. అది వారికి వాడుక భాష, వ్యావహారిక భాషగా ఉండడంగొప్ప విశేషం. ఈ ఊరును ఆదర్శంగా తీసుకొనే ప్రయత్నంలో కొందరు ఇప్పుడిప్పుడే ముందుకు వస్తున్నారు. మన దేశ నాగరికత విలసిల్లిన గత చారిత్రక వైభవంలో సంస్కృతం స్థానం శిఖరాయమానం. గ్రీకు, ల్యాటిన్, జర్మన్, ఫ్రెంచ్ మొదలైన భాషలుఇంకా విలసిల్లుతున్నాయి. వాటిల్లోని అనేక పదాలకు –సంస్కృత పదాలకు ఎంతో సారూప్యత ఉందని గమనించవచ్చు. భారతీయ భాషలతో పాటు అనేక ప్రపంచ భాషలకు కూడా సంస్కృతమే మూలమనే వాదన కూడా ఉంది. ఈ అంశంపై ఇంకా విస్తృతంగా అధ్యయనం జరగాల్సి వుంది. శబ్దశక్తి అపారంగా కలిగి, శ్రావ్యతలో తలమానికంగా నిలిచి, గొప్ప చారిత్రక నేపథ్యం కలిగి వున్న సంస్కృతం ఇంకా ఎన్నో రెట్లు ప్రచారంలోకి రావాలి. వాడుక పెరగాలి. మన వికాసానికి దోహదకారిగా నిలుపుకోవాలి. అమరభాషను మరవకుండా అధ్యయనం పెంచుకుంటూ ముందుకు సాగడం వివేక శోభితం, విజ్ఞాన భరితం. ప్రభుత్వాలు, ప్రజలు కలిసి సాగితేనే సర్వ సంకల్పాలు నెరవేరుతాయి.

# ఘట్టమనేని కృష్ణ



ఘట్టమనేని కృష్ణ (1943 మే 31 - 2022 నవంబరు 15) తెలుగు సినిమా నటుడు, దర్శకుడు, నిర్మాత. కృష్ణ 1970లు, 80ల్లో తెలుగు సినిమా హీరోగా ప్రజాదరణ సాధించి, సూపర్ స్టార్‌గా ప్రఖ్యాతి పొందాడు. ఆయన పూర్తిపేరు ఘట్టమనేని శివరామకృష్ణమూర్తి. 1964కు ముందు పలు సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసిన కృష్ణకు 1964–65లో హీరోగా నటించిన తొలి సినిమా తేనెమనసులు, మూడవ సినిమా గూఢచారి 116 పరిశ్రమలో నిలదొక్కుకునేందుకు ఉపకరించాయి. ఆపైన నాలుగు దశాబ్దాలకు పైగా సాగిన కెరీర్‌లో 340 పైచిలుకు సినిమాల్లో ప్రధాన పాత్రలో నటించాడు. 1970లో నిర్మాణ సంస్థను ప్రారంభించి పద్మాలయా సంస్థ ద్వారా పలు విజయవంతమైన చలన చిత్రాలు తీశాడు. 1983లో ప్రభుత్వ సహకారంతో స్వంత స్టూడియో పద్మాలయా స్టూడియోను హైదరాబాద్‌లో నెలకొల్పాడు. దర్శకుడిగానూ 16 సినిమాలు తీశాడు. ఘట్టమనేని కృష్ణ జననం:1943 మే 31, గుంటూరు జిల్లా, తెనాలి మండలములోని బుర్రిపాలెం. మరణం: 2022 నవంబరు 15 (వయసు 79)కృష్ణ నటించిన పలు సినిమాలు తెలుగులో కొత్త సాంకేతికతలు, జాన్రాలు పరిచయం చేశాయి. తెలుగులో తొలి జేమ్స్‌బాండ్ సినిమా (గూఢచారి 116), తొలి కౌబాయ్ సినిమా (మోసగాళ్ళకు మోసగాడు), తొలి ఫుల్‌స్కోప్ సినిమా (అల్లూరి సీతారామరాజు), తొలి 70 ఎంఎం సినిమా (సింహాసనం) వంటివి కృష్ణ నటించిన సినిమాలే. వీటితో పాటుగా పండంటి కాపురం, దేవుడు చేసిన మనుషులు, పాడిపంటలు, ఈనాడు, అగ్నిపర్వతం వంటి సూపర్ హిట్ సినిమాలు ఉన్నాయి. ప్రధానంగా 1976–1985 మధ్యకాలంలో కృష్ణ కెరీర్ అత్యున్నత దశకు అందుకుంది. 1964 నుంచి 1995 వరకు కృష్ణ సగటున పదేళ్ళకు వంద సినిమాలు, అంటే ఏడాదికి 10 సినిమాల చొప్పున 300 సినిమాలు పూర్తిచేశాడు. ఇందుకోసం మూడు షిఫ్టులు చొప్పున వేగంగా సినిమాలు పూర్తిచేసేవాడు. తాను బి.ఎ. చదువుతున్న రోజుల్లో ఏలూరులో అక్కినేని నాగేశ్వరరావుకు జరిగిన సన్మానం, దొరికిన ప్రజాదరణ చూసి సినిమా రంగంలోకి రావాలని నిర్ణయించుకున్న కృష్ణ అత్యంత వేగంగా తాను ఆశించిన ప్రజాదరణ సాధించాడు. కృష్ణకు రికార్డు స్థాయిలో 2500 అభిమాన సంఘాలు ఉండేవి. అతను అత్యున్నత దశలో ఉండగా ఒక సినిమా శతదినోత్సవానికి ఆంధ్రప్రదేశ్ నుంచి మద్రాసుకు 30 వేల మంది అభిమానులు స్వచ్ఛందంగా 400 బస్సుల్లో తరలివచ్చారు. కృష్ణకు అల్లూరి సీతారామరాజు చిత్రానికి ఉత్తమ నటునిగా నంది పురస్కారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందించింది. అతనికి ఫిల్మ్‌ఫేర్ సౌత్ జీవిత సాఫల్య పురస్కారం (1997), ఎన్టీఆర్ జాతీయ పురస్కారం (2003), ఆంధ్ర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ (2008), పద్మభూషణ్ పురస్కారం (2009) లభించాయి. 1984 నుంచి కాంగ్రెస్ సమర్థకుడిగా వ్యవహరించిన కృష్ణ ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ సినిమాలు చేశాడు. 1989లో ఏలూరు నియోజకవర్గం నుంచి లోక్‌సభ సభ్యునిగా గెలుపొందాడు. కృష్ణ కుటుంబం నుంచి కుమారులు మహేష్ బాబు, రమేష్ బాబు, కుమార్తె మంజుల, చిన్న అల్లుడు సుధీర్ బాబు సినిమా రంగంలోకి వచ్చారు. తోటి నటి అయిన విజయ నిర్మలను 1969లో ప్రేమించి రెండవ పెళ్ళి చేసుకున్నాడు. కుమారుడు మహేష్ బాబు పలు విజయాలు అందుకుని ప్రేక్షకుల నుంచి సూపర్ స్టార్ అన్న తండ్రి బిరుదు పొందాడు. విజయ నిర్మల అత్యధిక చిత్రాలు దర్శకత్వం వహించిన మహిళా దర్శకురాలిగా నిలిచింది. 2010 దశకంలో కృష్ణ నటన నుంచి, రాజకీయాల నుంచి విరమించుకుని విశ్రాంతి తీసుకుంటున్నాడు.

**బాల్యం, విద్యాభ్యాసం**

కృష్ణ 1943 మే 31న గుంటూరు జిల్లా, తెనాలి మండలములో తెనాలి పట్టణానికి 4 కిలోమీటర్ల దూరంలోని బుర్రిపాలెం గ్రామస్తులైన ఘట్టమనేని నాగరత్నమ్మ, వీరరాఘవయ్య చౌదరి దంపతుల పెద్ద కొడుకుగా జన్మించాడు. అతనిది రైతు కుటుంబం. తల్లిదండ్రులు పెట్టిన పేరు శివరామకృష్ణమూర్తి కాగా, సినిమాల్లోకి వచ్చినప్పుడు ఆదుర్తి సుబ్బారావు ఈ పేరును కృష్ణగా కుదించాడు. చిన్నతనం నుంచి అతనికి ఎన్.టి.రామారావు అభిమాన నటుడు.

**వ్యక్తిగత జీవితం**

కృష్ణకు హీరోగా తొలి సినిమా తేనె మనసులు ప్రారంభమయ్యేనాటికే ఇందిరతో వివాహం అయింది. 1965 అక్టోబర్ 13 నాటికి పెద్ద కొడుకు రమేష్ బాబు పుట్టాడు. కృష్ణ, ఇందిరలకు ఇద్దరు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు. పెద్ద కొడుకు రమేష్ బాబు హీరోగా కొన్ని సినిమాల్లో పనిచేసి, ప్రస్తుతం సినిమా నిర్మాణం చేస్తున్నాడు. చిన్న కొడుకు మహేష్ బాబు తెలుగు సినిమా రంగంలో ప్రముఖ నటునిగా స్థిరపడ్డాడు. కృష్ణ కుటుంబం నుంచి కుమార్తె మంజుల నటన, నిర్మాణం, దర్శకత్వం చేస్తుంది. 1967లో బాపు–రమణలు దర్శకత్వం వహించిన సాక్షి సినిమాలో కృష్ణ కథానాయకుడిగా, విజయ నిర్మల కథానాయకిగా నటించింది. తర్వాత సర్కార్ ఎక్స్‌ప్రెస్ సినిమాలో హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సమయంలో కృష్ణ విజయనిర్మలను ప్రేమిస్తున్నానని పెళ్ళిచేసుకుంటానని చెప్పాడు. పరస్పర అంగీకారంతో మరో రెండేళ్ళకు 1969లో తిరుపతిలో పెళ్ళిచేసుకున్నారు. అప్పటికే వివాహితులైన కృష్ణకు, విజయ నిర్మలకూ ఇది రెండవ పెళ్ళి. తోటి నటిగానూ, దర్శకురాలి గానూ విజయనిర్మల సినీ రంగంలో రాణించింది. వీటిలో పలు సినిమాల్లో కృష్ణ కథానాయకుడిగా చేశాడు. రెండవ పెళ్ళి కృష్ణ మొదటి భార్య పిల్లలు, విజయనిర్మల కుమారుడు నరేష్‌లపై ప్రభావం చూపింది. సామాజికంగా వారిని హేళన చేయడం వంటి అంశాలు తర్వాత కాలంలో గుర్తుచేసుకున్నారు. సినిమాల్లో కృష్ణ 90వ దశకం వరకూ విపరీతమైన బిజీ ఉండేది. కొన్ని సంవత్సరాల పాటు మూడు షిఫ్టులు పనిచేసేవాడు. ఉదయం, మధ్యాహ్నం మాత్రమే కాక మూడవ షిఫ్ట్ రాత్రి పది గంటల నుంచి తెల్లవారుజాము 2 గంటల వరకు ఉండేది. చివరికి నిద్రపోతున్న సమయంలో కాస్ట్యూమ్స్ వేసుకుని పడుకుంటే నిద్రిస్తున్న సన్నివేశాలు చిత్రీకరించుకున్న సందర్భాలు ఉన్నాయి. సినీ ప్రస్థానం

**తొలి అవకాశాలు, విజయం (1964–1967)**

కృష్ణ కెరీర్‌ని మలుపుతిప్పిన గూఢచారి 1161964లో ప్రముఖ దర్శక నిర్మాత ఆదుర్తి సుబ్బారావు అందరూ కొత్తవాళ్ళతో తాను తీస్తున్న తేనె మనసులు కోసం కొత్త నటులు కావాలని ఇచ్చిన పత్రికా ప్రకటనకు స్పందించి కృష్ణ తెనాలి నుంచి తన ఫోటోలు పంపించాడు. పలు వడపోతల తర్వాత మద్రాసు పిలిపించి కృష్ణకు స్క్రీన్ టెస్ట్ చేసి ఆదుర్తి కృష్ణను ఇద్దరు కథానాయకుల్లో ఒకడిగా ఎంపికచేశాడుసంభాషణలు చెప్పడం, డ్యాన్స్ చేయడం వంటి పలు అంశాల్లో శిక్షణనిచ్చారు. దీనితో పాటు తర్వాత ఆదుర్తి తీయబోయే మరో సినిమాలో కూడా నటించేలా కాంట్రాక్టు కుదుర్చుకున్నారు. కొత్త నటులుగా కృష్ణ, రామ్మోహన్, సుకన్య, సంధ్యారాణి నటించిన తేనె మనసులు సినిమాకి కలర్‌లో చిత్రీకరించిన తొలి తెలుగు సాంఘిక చిత్రంగా కూడా ప్రత్యేకత ఉంది. ఈ సినిమా సాగుతుండగానే రషెస్ చూసిన పంపిణీదారులు కృష్ణ నటన బాగాలేదని తొలగించెయ్యమని ఒత్తిడి తెచ్చినా ఆదుర్తి సుబ్బారావు తన నిర్ణయం మార్చుకోలేదు. 1965 మార్చి 31న విడుదలై విజయం సాధించింది. ఆరు నెలల తర్వాత ఆదుర్తి సుబ్బారావు ప్రారంభించిన కన్నెమనసులు సినిమాలో ముందస్తు ఒప్పందం ప్రకారం తేనె మనసులోని హీరో హీరోయిన్లతో పాటు కృష్ణ నటించాడు.

**తారాపథంలోకి (1968–1975)**

మోసగాళ్ళకు మోసగాడు: తొలి తెలుగు కౌబాయ్ సినిమా. స్వంత ఇమేజ్, స్టార్‌డమ్ సాధించేందుకు స్థాపించిన నిర్మాణ సంస్థ పద్మాలయా రెండవ చిత్రంగా విడుదలై కృష్ణకు స్టార్‌డం సాధించిపెట్టిన సినిమా. 1968లో కృష్ణ నటించిన 10 సినిమాలు విడుదలయ్యాయి. 1969లో రికార్డు స్థాయిలో 19 సినిమాలు విడుదలయ్యాయి. 1970లో 16 సినిమాలు, 1971 లో 11 సినిమాలు, 1972లో 18 సినిమాలు, 1973లో 15 సినిమాలు, 1974లో 13 సినిమాలు, 1975లో 8 సినిమాలు విడుదలయ్యాయి. ఈ దశలో కృష్ణ రోజుకు మూడు షిఫ్టుల చొప్పున విరామం ఎరుగక సినిమాలు చేయడం ప్రారంభించాడు. సినిమా అవకాశాల మీద అవకాశాలు వస్తున్నా, విజయవంతం అవుతున్నా అప్పటివరకు నటునిగానే ఉన్నానని భావించిన కృష్ణ తనకు స్టార్‌డం తెచ్చిపెట్టే సినిమాలు తీయాలని ఆశించి 1970లో తన స్వంత నిర్మాణ సంస్థ పద్మాల యా పిక్చర్స్ ప్రారంభించాడు. హాలీవుడ్‌లో ప్రఖ్యాతి చెందిన కౌబాయ్ జాన్రాను తెలుగులోకి తీసుకువస్తూ కృష్ణ స్వంత నిర్మాణంలో తీసిన మోసగాళ్ళకు మోసగాడు, ప్రముఖ బ్రిటీష్ వ్యతిరేక విప్లవయోధుడు అల్లూరి సీతారామరాజు జీవితం ఆధారంగా తీసిన అల్లూరి సీతారామరాజు సినిమాలు కృష్ణ కెరీర్‌కు మరింత సాయపడ్డాయి. భారీ బడ్జెట్‌లో తీసిన ఈ సినిమాలు నిర్మాణ దశలో ఉండగా పలు అవాంతరాలు ఎదుర య్యాయి. అల్లూరి సీతారామరాజు జీవితాన్ని "విప్లవజ్యోతి అల్లూరి సీతారామరాజు" పేరిట సినిమాగా తీస్తానని 1957 లోనే ప్రకటించి, తర్వాత స్క్రిప్టును పక్కన పెట్టి ఎన్.టి. రామారావు తీయకుండా తాత్సారం చేస్తూండడంతో కృష్ణ నిర్మించాడు. ఎన్.టి. రామారావు కృష్ణను ఆ సబ్జెక్టు ప్రజాదరణ పొందలేదని, తీయవద్దని వారించినా వినలేదు. అయితే ఆ అంశంపై వారిద్దరి నడుమ అభిప్రాయ భేదాలు తలెత్తాయి. పౌరాణికాల్లో నందమూరి తారక రామారావు, సాంఘికాల్లో అక్కినేని నాగేశ్వరరావు, జానపదాల్లో కాంతారావు అప్పటికే సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకుని ఉన్న స్థితిలో సినిమాల్లో అడుగుపెట్టిన కృష్ణ 1975 నాటికల్లా అగ్ర కథానాయకునిగా స్థానాన్ని సంపాదించుకున్నాడు. ఈ దశలో అగ్రతారలైన ఎన్టీఆర్ (స్త్రీ జన్మ, నిలువు దోపిడీ, దేవుడు చేసిన మనుషులు, విచిత్ర కుటుంబం), నాగేశ్వరరావు (అక్కా చెల్లెలు, మంచి కుటుంబం)లు సహా పలువురు తోటి హీరోలతో అనేక మల్టీస్టారర్ సినిమాలు చేశాడు. కృష్ణ యాక్షన్ సినిమాల ద్వారా అగ్రపథాన్ని చేరుకుంటున్నా సమాంతరంగా ఉండమ్మా బొట్టు పెడతా, పండంటి కాపురం, గాజుల కిష్టయ్య, దేవుడు చేసిన మనుషులు, మాయదారి మల్లిగాడు లాంటి కుటుంబ కథా చిత్రాలు కూడా చేశాడు. మోసగాళ్ళకు మోసగాడు ఘన విజయం సాధించడంతో పలువురు కౌబాయ్ సినిమాల నిర్మాణం చేపట్టారు. వాటిలో అధిక శాతం సినిమాల్లో హీరోగా కృష్ణే నటించాడు. కృష్ణ 100వ చిత్రమైన అల్లూరి సీతారా మరాజు 1974లో విడుదలైంది. హీరోగా తొలి సినిమా విడు దలైన 9 సంవత్సరాలకల్లా కృష్ణ వంద సినిమాలు పూర్తిచేసుకున్నాడు.

**మరిన్ని విజయాల్లోకి (1976–1989)**

కృష్ణ అర్జునుడిగా నటించిన కురుక్షేత్రం సినిమా 1977 సంక్రాంతికి విడుదలైంది. మహాభారత కథాంశంతోనే వచ్చిన ఎన్టీఆర్ దానవీరశూర కర్ణ సినిమాతో పోటీపడి సంక్రాంతికి విడుదలై ఫ్లాప్ అయింది. అల్లూరి సీతారామరాజు సినిమా అత్యంత విజయవంతమయ్యాకా 1974, 1975లో కృష్ణ చేసిన పలు సినిమాలు ఫ్లాపయ్యాయి. దాంతో తాను అంతకుముందు కమిట్ అయిన సినిమాలు పూర్తయ్యాకా మరెవ్వరూ సినిమాలు తీయడానికి ముందుకురాలేదు. కృష్ణ కెరీర్ ఒక్కసారిగా స్తబ్దుగా అయిపోయిన దశలో తన స్వంత నిర్మాణ సంస్థలో పాడిపంటలు సినిమా తీసి 1976 సంక్రాంతికి విడుదల చేయాలని నిర్ణయించుకున్నాడు. అప్పటివరకూ ప్రధానంగా ఎన్.టి.రామారావు, అక్కినేని నాగేశ్వరరావు మధ్యనే ప్రధానంగా నడిచిన సంక్రాంతి సినిమాల పోటీలోకి కృష్ణ 1976లో పాడిపంటలు సినిమాతో దిగాడు. 1976 సంక్రాంతికి రామారావు వేములవాడ భీమకవి, శోభన్ బాబు పిచ్చిమారాజు సినిమాలతో పోటీగా పాడిపంటలు విడుదలై సంక్రాంతి సినిమాగా విజయాన్ని దక్కించుకుంది. తర్వాత ఇంద్రధనుస్సు (1978), భలే కృష్ణుడు (1980), ఊరికి మొనగాడు (1981), బంగారు భూమి (1982), బెజవాడ బెబ్బులి (1983), ఇద్దరు దొంగలు (1984), అగ్నిపర్వతం (1985), తండ్రీ కొడుకుల ఛాలెంజ్ (1987), కలియుగ కృష్ణుడు (1988), రాజకీయ చదరంగం (1989) సినిమాలను సంక్రాంతి పోటీలో విడుదల చేశాడు. కృష్ణ స్వీయ నిర్మాణ దర్శకత్వంలో నటించిన సింహాసనం సినిమా ఘన విజయం సాధించింది. భారీ ఎత్తున నిర్మించిన ఈ జానపద చిత్రం తెలుగులో తొలి సినిమా స్కోప్ సినిమా. 1978–1985 మధ్యకాలం కృష్ణ కెరీర్‌లో ఉచ్ఛదశ నడిచింది. ఈ దశలో కూడా అత్యంత వేగంగా సినిమాలు పూర్తిచేశాడు. 1977 నుంచి పదేళ్ళు లెక్క వేసుకున్నా హీరోగా మరో 117 సినిమాల్లో నటించాడు. 1977 నుంచి 1989 మధ్య కాలంలో యాక్షన్ చిత్రాల దర్శకత్వంలో పెద్ద పేరు పొందిన కె.ఎస్.ఆర్.దాస్ కాంబినేషన్‌లోనే 20 సినిమాల్లో నటించాడు. ఆ కాలంలోనే మరో 20 పైచిలుకు సినిమాలు తన భార్య విజయనిర్మల దర్శకత్వంలో చేశాడు. యాక్షన్ హీరోగా తనకున్న ఇమేజిని కొనసాగిస్తూనే కుటుంబ కథా చిత్రాల్లోనూ నటించాడు. సీనియర్ నటుడు అక్కినేని నాగేశ్వరరావు (హేమాహేమీలు, గురు శిష్యులు) తోటి హీరోలు శోభన్‌బాబు (కృష్ణార్జునులు, ఇద్దరు దొంగలు), కృష్ణంరాజు (మనుషులు చేసిన దొంగలు, అడవి సింహాలు, విశ్వనాథ నాయకుడు) అప్పుడప్పుడే ఎదుగుతున్న రజినీకాంత్ (అన్నదమ్ముల సవాల్, రామ్ రాబర్ట్ రహీమ్), మోహన్ బాబు (ముగ్గురూ ముగ్గురే) వంటి వారందరితోనూ అనేక మల్టీస్టారర్ సినిమాలు చేయడం కొనసాగించాడు. ఎన్టీ రామారావుతో అప్పటికే విభేదాలు ఏర్పడ్డా ఇద్దరూ వాటిని పక్కన పెట్టి కృష్ణ–రామారావు మల్టీస్టారర్ కాంబినేషన్‌లో వయ్యారి భామలు వగలమారి భర్తలు సినిమాలో నటించారు. కటకటాల రుద్రయ్య (1978), ఖైదీ (1983) వంటి పలు సినిమాలు అసలు కృష్ణ నటించాల్సి వచ్చినా వివిధ కారణాల వల్ల వదులుకున్నాడు. కృష్ణంరాజు కెరీర్‌ను కటకటాల రుద్రయ్య, చిరంజీవి కెరీర్‌ను ఖైదీ మలుపు తిప్పే స్థాయి విజయాలు అయ్యాయి. 1982లో భవనం వెంకట్రామ్ ప్రభుత్వం హైదరాబాద్‌లో పద్మాలయా సంస్థకు స్టూడియో నిర్మించుకోవడానికి జూబ్లీహిల్స్‌లో 10 ఎకరాల స్థలాన్ని ఇచ్చింది. 1983 నవంబరు 21న ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు చేతుల మీదుగా పద్మాలయా స్టూడియోస్ ప్రారంభం కావడంతో కృష్ణ స్టూడియో యజమాని అయ్యాడు. 1982లో తెలుగుదేశం పార్టీ పెట్టి ఎన్టీ రామారావు ఏడాదిలోపు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కావడం, రాజీవ్ గాంధీ సహకారంతో కాంగ్రెస్‌తో అనుబంధం ఏర్పడడంతో కృష్ణ ఈ దశలో రాజకీయ నేపథ్యంలో రాజకీయ నేపథ్యంలోని పలు సినిమాల్లో నటించాడు. ముఖ్యమంత్రి, ప్రజా ప్రతినిధి, నా పిలుపే ప్రభంజనం, సాహసమే నా ఊపిరి వంటి సినిమాలతో పాటుగా, మలయాళంలో విజయవంతమైన సినిమాను తెలుగు రాజకీయ వాతావరణానికి అనుగుణంగా అడాప్ట్ చేసిన ఈనాడు సినిమా సరిగ్గా 1982లో ఎన్నికలకు ముందు విడుదలై ఘన విజయాన్ని సాధించింది. ఈనాడు సినిమాతో కృష్ణ 200 సినిమాల మైలురాయిని చేరుకున్నాడు. సింహాసనం సినిమాను స్వంత బ్యానర్‌లో తొలిసారి తానే దర్శకత్వం చేపట్టి భారీ బడ్జెట్‌తో తెరకెక్కించాడు. పెద్ద సెట్‌లతో సినిమాను సాంకేతికంగా ఉన్నతంగా తీశాడు. విడుదలైన మొదటి వారంలోనే రూ.కోటి 51 లక్షలకు పైగా వసూళ్ళు సాధించి సంచలనం సృష్టించింది. విశాఖపట్టణం చిత్రాలయ థియేటర్‌లో వంద రోజులు, విజయవాడ రాజ్ థియేటర్‌లో 53 రోజులు వరుసగా ఒక్కరోజు కూడా విడువకుండా హౌస్ ఫుల్ అయి మరో రికార్డు సృష్టించింది. సింహాసనం సినిమా ద్విభాషా చిత్రం, సింఘా సన్‌గా హిందీలో తానే నిర్మాణ, దర్శకత్వ బాధ్యతలు చేపట్టి జీతేంద్ర కథానాయకుడిగా విడుదల చేశాడు. అయితే ఇది ఫ్లాప్‌గా మిగిలింది. ఈ దశలో సింహాసనం, అగ్నిపర్వతం, వజ్రాయుధం, ఊరికి మొనగాడు, ఈనాడు వంటి సినిమాలు ఘన విజయం సాధించాయి. ఇవి కాక మరెన్నో సినిమాలు కమర్షియల్ విజయాన్ని సాధించి కృష్ణ సినీ జీవితంలో ఈ దశను అత్యున్నత స్థాయిగా నిలిపాయి.

సేనాధిపత్యం రమేష్

# ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు వేదిక..శ్రీబాగ్ ఒడంబడిక







రాయలసీమ ప్రయోజనాల పరిరక్షణకు 1937 నవంబర్ 16 వతేదీ జరిగిన శ్రీ బాగ్ ఒడంబడిక నివురు గప్పిన నిప్పులా రాజుకుంటూనే ఉంది. ఎనిమిది దశాబ్దాలు దాటినా, మానని గాయంలాగా ఇప్పటికీ కెలుకుతోంది. గత కొన్ని ఏళ్లుగా నవంబర్ మాసం వస్తే రాయలసీమలో అలజడి రేగుతోంది. ఈ ఏడు సైతం సీమలో ఎవరికి వారు పలు ప్రజా సంఘాలు నవంబర్ 16 వతేదీ శ్రీ బాగ్ ఒడంబడిక అమలు చేయాలని డిమాండ్ చేసేందుకు పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నారు. ప్రధానంగా విద్యార్థులు యువత పలు పట్టణాల్లో ప్రచారంలో భాగంగా పోస్టర్లు కర పత్రాలు ఉపయోగిస్తున్నారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటుపై కోస్తా ఆంధ్ర, రాయలసీమ నాయకుల మధ్య ఏర్పడిన అపోహలను, విభేదాలను తొలగించే ఉద్దేశంతోఉమ్మడి మద్రాసులో 1937లో నవంబరు 16న ఎనిమిది మంది సభ్యుల సమక్షంలో జరిగిన ఒప్పందమే శ్రీబాగ్ ఒడంబడిక. దీనినే పెద్ద మనుషుల ఒప్పందం అని కూడా అంటారు. దీని ముఖ్య ఉద్దేశం రాయలసీమ అభివృద్ధి, ప్రయోజనాలు. మద్రాసులో కాశీనాథుని నాగేశ్వరరావుగారి శ్రీబాగ్ మహలు లో 1937 నవంబరు 19న సమావేశమై (సర్కారాంధ్ర, రాయలసీమ) సామరస్య సాధనగా పెద్ద మనుషుల ఒప్పందం ( శ్రీబాగ్ ఒడంబడిక ) సాధించారు. ఆస్థల గౌరవార్ధం ఆ ఒడంబడికను శ్రీబాగ్ ఒడంబడికగా పిలవడం జరిగింది. ఈ ఒప్పందం వీరిమధ్య సదవగాహనను పెంపొందించి, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమం చేసింది. ప్రత్యేకాంధ్ర ఉద్యమంలో కోస్తా, రాయలసీమ నాయకుల మధ్య విభేదాలు ఉండేవి. 1926లో ఏర్పాటైన ఆంధ్ర విశ్వ విద్యాలయమును ఎక్కడ ఏర్పాటు చెయ్యాలనే విషయంతో ఈ విభేదాలు మొదలయ్యాయి. అప్పటి మద్రాసు ముఖ్యమంత్రి డా. సుబ్బారాయన్ తీసుకున్న నిర్ణయాలు ఇందుకు ఇతోధికంగా తోడ్పడ్డాయి. ఆ తరువాత, 1913నుండి, 1935 వరకు జరుగుతూ వచ్చిన ఆంధ్ర మహాసభ సమావేశాలలో, ఆంధ్ర కాంగ్రెసు కమిటీ ఎన్నికలలోను ఇవి బయటపడుతూ ఉండేవి. 1917లో నెల్లూరులో జరిగిన ఆంధ్ర మహాసభ సమావేశాలలో ప్రత్యేకాంధ్ర తీర్మానాన్ని ఓడించ డానికి రాయలసీమ, నెల్లూరు ప్రతినిధులు తీవ్రంగా ప్రయత్నించారు. 1924లో విజయవాడలో జరిగిన ఆంధ్ర కాంగ్రెసు కమిటీ ఎన్నికలలో అధ్యక్ష పదవికి పోటీచేసిన రాయలసీమకు చెందిన నాయకుడు, గాడిచర్ల హరిసర్వోత్తమ రావును ఆంధ్ర నాయకులు ఓడించారు. ఆనాటి రాయలసీమ రాజకీయ నాయ కత్వంలో తమిళుల ప్రాబల్యం అధికంగా ఉండటం, వారు సహజంగానే ప్రత్యేకాంధ్రకు వ్యతిరేకంగా ఉండటం ఈ విభేదాలకు ఒక ప్రధాన కారణం. కేశవ పిళ్ళై, ఏకాంబర అయ్యర్ వీరిలో ప్రముఖులు. 1934 లో రాయలసీమ పరిరక్షణ పేరుతో జస్టిస్ సి. యల్. నరసింహా రెడ్డి కె. సుబ్రహ్మణ్యం చొరవతో రాయలసీమ మహాసభ ఏర్పాటు చేశారు. 1934 జనవరిలో మద్రాసులో తొలి సభ జరిగింది. కడపకు చెందిన నెమలి పట్టాభిరామా రావు సభకు అధ్యక్షత వహించగా ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సెంట్ మెంట్ ను వ్యతిరేకించే తమిళ కాంగ్రెస్ నేత యస్. సత్య మూర్తి సభను ప్రారంభించారు. తిరిగి 1935 సెప్టెంబర్ లో రెండవ సభ కడపలో జరిగింది. 1937 లో జరిగిన ఎన్నికల్లో జస్టిస్ నరసింహా రెడ్డి సుబ్రహ్మణ్యం ఓడి పోయారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందినది. 1937 ఎన్నికల తర్వాత ఆంధ్ర ప్రాంత కాంగ్రెసు అధ్యక్షులుగా భోగ రాజు పట్టాభి సీతారామయ్య ఎన్నికైనారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం తీవ్రతరం చేశారు. అయితే రాయలసీమ ప్రాంత నేతల సహకారం లేనిదే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం సాధించడం సాధ్యం కాదని కోస్తా కాంగ్రెస్ నేతలు గుర్తించారు. 1937 అక్టోబర్ లో విజయవాడలో ఆంధ్ర మహాసభ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవాలకు రాయలసీమకు చెందిన కడప కోటి రెడ్డి అధ్యక్షత వహించగా హాలా హర్వి సీతారామ రెడ్డి ప్రారంభించారు. ఇరువురు కూడా రాయల సీమ నుండి శాసనసభ్యులుగా వున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు సహకరించాలంటే రాయలసీమ ప్రయోజనాలకు రక్షణ ఇవ్వ వలసినదిగా ఇద్దరూ కోరారు. ఈ మహాసభలో జరిగిన చర్చలు పరస్పరం భావాలు ఇచ్చి పుచ్చుకున్నందున శ్రీ బాగ్ ఒడంబడిక కుదరడానికి పునాది రాయి పడింది. నాయకులు విభేదాలను తొలగించుకోవాలన్న నిశ్చయానికి వచ్చారు. మంత్రివర్గం ఏర్పాటు, నీటిపారుదల, రాజధాని మొదలైన విషయాలలో రాయలసీమకు రక్షణలు అవసరమన్న భావనను రాయలసీమ నాయకులు వ్యక్తపరచగా, ఈ విషయాలను పరిశీలించేందుకు ఒక సంఘాన్ని నియమించారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, హాలహర్వి సీతారామరెడ్డి, కడప కోటిరెడ్డి, కొండా వెంకట ప్పయ్య, టి. ఎన్.రామకృష్ణారెడ్డి, మహబూబ్ ఆలీ బేగ్, దేశిరాజు హనుమంత రావు, కల్లూరు సుబ్బారావు, దేశపాండ్య సుబ్బారావు, వరదాచారి, పప్పూరి రామాచారి, సుబ్బరామి రెడ్డి, ముళ్ళపూడి పల్లంరాజు తదితర సంఘ సభ్యులంతా 1937 నవంబర్ 16న మద్రాసులో దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు నివాసమైన శ్రీబాగ్ లో సమావేశమై, ఒక ఒప్పందానికి వచ్చారు. ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఆ ఇంటి పేరుమీదనే ఈ చారిత్రాత్మక ఒప్పందానికి శ్రీబాగ్ ఒడంబడిక అని పేరు వచ్చింది. రాష్ట్ర రాజధాని మద్రాసుగానీ, రాయలసీమలో ఏదో ఒక పట్టణం అయివుండాలి. శాసనసభలో రాయలసీమకు సరియైన ప్రాతినిధ్యము ఉండాలి. సరి సమాన సంఖ్యలో మంత్రులుండాలి. ఆర్థిక వెనుక బాటు తనం మూలాన వెంటనే తుంగభద్ర, హగరి ప్రాజక్టులు చేపట్టాలి. రాష్ట్ర ఆదాయాన్ని సమానంగా పంచాలి. ఆంధ్ర యూనివర్సిటీ రెండు కేంద్రాలు ఏర్పాటు చేయడం. ఒకటి వైజాగ్ లో రెండవది అనంతపురంలో నెలకొల్పడం. రాయలసీమతో పాటు నెల్లూరు జిల్లాలో వ్యవసాయ రంగంలో ఆర్థికాభివృద్ధి కోస్తా ప్రాంతంతో సమానంగా సాధించేందుకు తుంగభద్ర కృష్ణ, పెన్నా నదులపై నిర్మించే పెద్ద ప్రాజెక్టుల ప్రయోజ నాలు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. చట్ట సభల్లో రిజర్వేషన్ స్థానాలు మినహా జనరల్ స్థానాలు జిల్లా స్థాయిలో సమానంగా వుండాలి. రాజధాని హైకోర్టు వేర్వేరు ప్రాంతాల్లో వుండాలి. ముందు ఛాయిస్ రాయలసీమకు ఇవ్వాలి. సదరు తీర్మానాలు సభలో ప్రవేశ పెట్టడం, ఏకగ్రీవంగా ఆమోదంపొందడం జరిగింది.

రామ కిష్టయ్య సంగన భట్ల

# విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలి : సీపీఎం






దేవనకొండ నవంబర్ 15 (ఆంధ్ర పత్రిక) : రాష్ట్ర ప్రజలు అనేక ఆశలతో గత ప్రభుత్వ తప్పిదల వలన కూటమి ప్రభుత్వానికి పట్టం కడితే రాష్ట్ర ప్రజలపై ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీలు పెంచడానికి సిద్ధంగా ఉందని విద్యుత్ చార్జీల పెంపుదల ప్రతిపాదన ను వెంటనే విరమించుకోవాలని, సూపర్ సిక్స్ పథకాల వెంటనే అమలు చేయాలని సిపిఎం జిల్లా నాయకులు బి వీర శేఖర్ డిమాండ్ చేశారు.సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు ఆ పార్టీ కేంద్ర, రాష్ట్ర కమిటీల పిలుపుమేరకు ప్రజల పట్ల ప్రభుత్వ విధానాలపై ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం నాయకులు యూసుఫ్ బాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి వీరశేఖర్ అశోక్, సూరీ లు మాట్లాడుతూ రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేస్తుందని, ప్రజలకు మేలు చేయకుండా భారాలు వేసే పని పెట్టుకున్నదని, విద్యుత్ ట్రూ ఆఫ్ చార్జీలు రద్దు చేయాలని కొత్త స్మార్ట్ మీటర్ల పెట్టే విధానాన్ని మానుకోవాలని, నిత్యవసర సరుకుల ధరలు అదుపు చేయాలని, రైతు భరోసా ద్వారా రైతులకు 20వేలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ పిలుపులు భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజా పోరు పేరుతో నవంబర్ 8వ తేదీ నుండి 13వ తేదీ వరకు ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఎం జిల్లాలో ప్రజాపోరు నిర్వహించిందినీ పేర్కొన్నారు.

రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో జాప్యం చేస్తుందని వారు విమర్శించారు. అమరావతికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా గ్రాంటూ పేరుతో మోసం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు కర్నూలు జిల్లా అభివృద్ధి కోసం, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం కోసం సరైన ప్రణాళిక తో నిధులు కేటాయింపు జరగలేదాని వేదావతికి నిధులు కేటాయించకపోవడం ఆ ప్రాజెక్టు పట్ల ప్రభుత్వం విధానం తెలియజేస్తుందని పేర్కొన్నారు, ఉచిత ఇసుక ,తల్లికి వందనం ఫీజు రీయింబర్స్మెంట్ రైతు భరోసా వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో కౌలుట్ల బండ్లయ్య రాముడు మహేష్ బజారి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

### ఎ.పి.యు.జె. ధర్మవరం డివిజన్ ఉపాధ్యక్షుడిగా

## రామకృష్ణ ఏకగ్రీవంగా ఎంపిక





ధర్మవరం నవంబర్ 15 (అంధ్రపత్రిక): ఎ.పి.యు.డబ్ల్యూ.జె. ధర్మవరం డివిజన్ కమిటీ ఉపాధ్యక్షుడిగా అంధ్రపత్రిక విలేకరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.శుక్రవారంనాడు ధర్మవరం డివిజన్ పరిధిలోని బత్తలపల్లి మండల కేంద్రంలో ఉన్న ఆర్ కె ఫంక్షన్ హాల్ నందు శ్రీ సత్యసాయి జిల్లా ఎ. పి.యు డబ్ల్యూ. జె జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య ఆధ్వర్యంలో తారీఖు /15/11/2024 వ శుక్రవారం రోజు ధర్మవరం డివిజన్ పరిధిలోని మండలాల్లో ఉన్న పత్రికలు, అలాగే ఎలెక్ట్రానిక్ మీడియా పాత్రికేయుల అందరి సమక్షంలో జరిగిన సమావేశంలో ఎ. పి.యు డబ్ల్యూ. జె ధర్మవరం డివిజన్ కమిటీ ఉపాధ్యక్షుడిగా రాచెర్ల రామకృష్ణ( అంధ్రపత్రిక )విలేకరి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాచెర్ల రామకృష్ణ మాట్లాడుతూ ముందుగా శ్రీ సత్యసాయి జిల్లా ఎ.పి.యు.డబ్ల్యూ.జె. జిల్లా కమిటీ సభ్యులకు, అలాగే ధర్మవరం డివిజన్ ఎ. పి.యు.డబ్ల్యూ.జె.కమిటీ సభ్యులందరికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియచేశారు. అలాగే ధర్మవరం డివిజన్ పరిధిలోని మండలాల వివిధ పత్రికలు, అలాగే ఎలెక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు అందరికి కృతజ్ఞతలు తెలుపుతూ . మీ అందరి ప్రోత్సాహముతో ఈ యొక్క ఉపాధ్యక్షుడు పదవి ఇచ్చినందులకు మీ అందరికి పెరు, పెరు నా యొక్క ధన్యవాదాలు అన్నారు.నామీద నమ్మకం ఉంచి ఈ పదవిని ఇచ్చినందులకు మీరు నా మీద పెట్టియున్న మీ అందరి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ధర్మవరం డివిజన్ ఎ. పి.యు.డబ్ల్యూ జె . కమిటీ అభివృద్ధి కి తన్స్ వంతుగా కృషి చేస్తానని ఆయన అన్నారు.

## ఆంజనేయస్వామి ఏకశిలా విగ్రహ ఏర్పాటుకు విరాళం



హిందూపురం, నవంబర్ 15 (ఆంధ్ర పత్రిక) : ఆంజనేయస్వామి పరమ భక్తుడైన వైసి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో పట్టణంలోని సూగూరు ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణం లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఆంజనేయస్వామి రాతి ఏకశిలా విగ్రహం అభివృద్ధి కోసం మాజీ మున్సిపల్ చైర్మన్ జె.వి అనిల్ కుమార్ రూ.2 లక్షల 7వేల రూపాయలు విరాళంగా అందించి తమ భక్తిని చాటుకున్నారు.ఈ సందర్భంగా హిందూపురం పట్టణానికే తలమాణికంగా నిలుస్తున్న ఆంజనేయ స్వామి రాతి ఏకశిలా విగ్రహ ఏర్పాట్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మంచి నైపుణ్యత గల శిల్పులచే ఆంజనేయస్వామి రాతి ఏకశిల విగ్రహం చూడముచ్చటగా చెక్కుతున్నారు. శుక్రవారం మాజీ మున్సిపల్ చైర్మన్ జెవి అనిల్ కుమార్ ఎంతోదృఢ సంకల్పంతో ట్రస్ట్ చైర్మన్ వైసీ చంద్రశేఖర్ కు రూ.2 లక్షల 7వేల రూపాయలు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు జేవి అనిల్ కుమార్ కు కృతజ్ఞతలు తెలుపుతూ వారి కుటుంబానికి ఎల్లవేళలా ఆంజనేయ స్వామి ఆశీస్సులు ఉండాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పేట వెంకటరమణ స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ రాయల్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మొగిలీశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు



**బంగారుపాళ్యం, నవంబర్ 15 (ఆంధ్రపత్రిక) :** చిత్తూరు జిల్లా బంగారు పాళ్యం మండలం మొగిలి గ్రామంలో వెలసిన శ్రీకామాక్షిదేవి సమేత మొగిలీశ్వర స్వామి దేవాలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మొగిలి దేవాలయానికి మహిళలు అధిక సంఖ్యలో వచ్చి కార్తిక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. రాబోయే మూడు రోజుల్లో రానున్న కార్తీక సోమవారం రోజున భక్తులు మరింతగా రావచ్చని ఆలయ ఈవో మునిరాజులు తెలిపారు.ఆలయానికి వచ్చే భక్తులకు సర్వదర్శన ఏర్పాట్లను ఆలయ సిబ్బంది ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసారు.

## సిద్దేశ్వరకొండపై ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు



**బంగారుపాళ్యం, నవంబర్15 (ఆంధ్రపత్రిక):** చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారు పాళ్యం మండలం కె.జి.సత్రం సమీపంలోని సిద్దేశ్వం కొండపై కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ప్రకృతి ఒడిలో వెలసిన శ్రీ పార్వతి సమేత సిద్ధేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.అనంతరం నెల్లి చెట్టుకు పూజలు చేసి దీపాలు వెలిగించారు.స్వామి,అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.గుడి నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.అలాగే రాత్రికి స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి శివకోటి భజనలు జరుగుతుందని తెలిపారు.

## కార్తీక పౌర్ణమికి వి.కోట నుంచీ ప్రత్యేక ఆర్టీసీ బస్సు



**వి.కోట నవంబరు 15(ఆంధ్ర పత్రిక):** వి.కోట మండల కేంద్రం నుంచీ తమిళనాడులోని ప్రముఖ శైవ క్షేత్రం తిరువన్నామలైకు కుప్పం ఆర్టీసీ వారిచే నూతన సర్వీసు శుక్రవారం మొదలైంది.స్థానిక శ్రీవీరాంజనేయ స్వామి,దుర్గామాత ఆలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం మాజీ ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచంద్రనాయుడు బస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ప్రాంతీయ డిప్యూటీ చైర్మన్ పి ఎస్ మునిరత్నం ఆదేశాల మేరకు, డిపో మేనేజర్ గోపినాథ్ సహకారంతో తిరువన్నామలైకు ,అదేవిధంగా మరికొన్ని దేవాలయాలకు ఒక్కరోజు ప్రత్యేక ప్యాకేజీతో నూతన సర్వీసులను అందిస్తున్నారని తెలియజేశారు. దీంతో వందలాదిమంది భక్తాదులక్ హర్షం వ్యక్తం చేశారు. ముందుగా ఆర్టీసీలో తాము రిజర్వేషన్ చేసుకుని ప్రయాణీకులు సురక్షితంగా ప్రయాణించవచ్చని ఆర్టీసీ వారు తెలియజేశారు.

## పుస్తక పఠనంతోనే బంగారు భవిష్యత్తు



**చౌడేపల్లి, నవంబరు 15(ఆంధ్ర పత్రిక):** పుస్తక పఠనంతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో సందర్భంగా పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రసంగిస్తూ. మొబైల్ ఫోన్ వాడటం వల్ల వినాశనాలు అధికంగా జరుగుతాయని, పుస్తక పఠనంతో జ్ఞానాన్ని పెంపొందించు కోవచ్చును అన్నారు. విద్యార్థులందరూ పుస్తక పఠనంతోనే ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మురళి, పంచాయతీ కార్యదర్శి మహేష్, గ్రంథాలయాధికారి సోమశేఖర్, స్థానికులు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

## బ్యాంకు రెడ్డప్పకు దక్కిన అరుదైన గౌరవం

### రాజమహేంద్రవరంలో ఘన సన్మానం



**చౌడేపల్లి, నవంబర్ 15 (ఆంధ్రపత్రిక) :** డిసిసి బ్యాంక్ చిత్తూరు జిల్లా కార్యదర్శి బ్యాంకు రెడ్డప్పకు అరుదైన గౌరవం దక్కింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరిగిన. ఆంధ్రప్రదేశ్ సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగస్తుల యూనియన్ నందు ఆయనకు ఘన సన్మానం లభించింది. రాష్ట్ర నాయకత్వంలో కేవీఎస్ రవి, రాష్ట్ర అధ్యక్షుడు నారాయణరెడ్డి, ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సమావేశాన్ని రాజమహేంద్రవరంలో నిర్వహించారు. సహకార కేంద్రీయ బ్యాంకు ఉద్యోగస్తుల రివిజన్ బ్యాంకుల్లో ఆప్కాబ్ రెండించల విధానంపై అవుట్సోర్సింగ్ మెసెంజర్ రెగ్యులర్ విషయం సమావేశంలో ముఖ్యంశాలుగా చర్చించారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లాలో నిర్వహించిన సభ్యత్వంలో పూర్తిస్థాయి ప్రతిభను కనబరిచారు. దీనివల్ల బ్యాంకు రెడ్డప్పను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రెటరీ కెవిఎస్ రవికుమార్, డిప్యూటీ ప్రెసిడెంట్ నారాయణ రెడ్డి, సంఘ చైర్మన్ తోట రామారావు, సంఘ వ్యవస్థాపకులు, జాతీయ సహకార బ్యాంక్ ఉద్యోగస్తులు చైర్మన్ సిఎస్ మాధవ్, ఎక్స్ జనరల్ సెక్రెటరీ వైస్సార్క్ ప్రసాదు, ఏఐటిసి రాష్ట్ర అధ్యక్షులు రాధాకృష్ణ మూర్తి, నెల్లూరు జిల్లా రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు, క్రాంతి, సీతారాం, అనిల్, మాజీ యూనియన్ నాయకులు రీవీ, సత్యనారాయణ, ఆఫీస్ బేరర్స్, సభ్యులు పాల్గొన్నారు.

## గ్రంథాలయాల ద్వారా విజ్ఞాన సముపార్జన



**అట్లూరు నవంబర్15 (ఆంధ్రపత్రిక):** స్థానిక అట్లూరు గ్రంథాలయంలో శుక్రవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సం దర్భంగా గ్రంథాలయ శాఖ అధికారి సుధాకర్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అట్లూరు ఇంచార్జ్ మండల అభివృద్ధి అధికారి భాస్కర్ బాబు పుస్తక ప్రదర్శన నుప్రారంభించినారు. అనంతరం భాస్కర్ బాబు మాట్లాడుతూ గ్రంథాలయంలో వివిధ రకాల గ్రంథాలు పుస్తకాల వల్ల ఎంతో జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చు ననీ ఆయన,అన్నారు.శ్రీవిద్య హై స్కూల్ విద్యార్థులు 42 మంది హాజరైనారు. పుస్తక పఠనం వలన కలిగే ప్రయోజనాలు విద్యార్థులకు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో పాఠకులు మస్తాన్ యాదవ్ ,సుబ్బారెడ్డి, గోపాలయ్య, కృష్ణారెడ్డి మరియు శ్రీవిద్య స్కూలు ఉపాధ్యాయులు రమాకాంత్, నాగేంద్ర పాల్గొన్నారు.

## అభివృద్ధి జరగాలంటే ప్రణాళిక అవసరం




**అట్లూరు నవంబర్15 (ఆంధ్రపత్రిక):** గ్రామాలలో అభివృద్ధి జరగాలంటే ప్రతి ఒక్కరం ముందు ముందు రోజుల్లో జరగబోవు ప్రణాళిక ఎంతో అవసరం అని ఇన్చార్జ్ ఎంపీడీవో భాస్కర్ బాబు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సభా భవనంలో గ్రామపంచాయతీ డెవలప్మెంట్ సమావేశం జరిగింది. సందర్భంగా ఇన్చార్జ్ ఎంపీడీవో భాస్కర్ బాబు మాట్లాడుతూ 2025-26 నాటికి ప్రణాళికలను తయారు చేసుకొని పంచా యితీలలోని ముఖ్యమైన సమస్యలకు పంచాయతీల గ్రాంట్ ల లోని 25 శాతం ఖర్చుపెట్టి మిగిలిన సొమ్మును సంవత్సరంలో అన్ని అంశాలపై అభివృద్ధి జరగాలని రాబోవు రోజుల్లో ఎంత నిల్వ ఉంది చేయాల్సిన వ్యయం ఎంత వీటిపై చర్చించుకుంటే బాగుంటుందని తెలిపారు. రాబోవు 30 సంవత్సరాలు ప్రణాళికలను గ్రామపంచాయతీలలో డెవలప్ కావాల్సిన నిధులకు సంబంధించి మండల స్థాయిలో చర్చించుకుని జిల్లా స్థాయికి ప్లానింగ్ తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.

## రాయలసీమకు ద్రోహం చేస్తే ఊరుకునేది లేదు

### రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి




కడప నవంబర్ 15 (ఆంధ్రపత్రిక): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మీద ఉన్న కోపంతో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయలసీమకు అన్యాయం చేస్తున్నారని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ (ఆర్ సి పి) రాష్ట్ర కార్యదర్శి ఎన్ రవిశంకర్ రెడ్డి అన్నారు శుక్రవారం నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు రాయలసీమ ప్రాంతంలో నిర్మితమైన సంస్థలను, అమరావతికి తరలించకపోతూ,ఈ ప్రాంతాన్ని స్మశానంగా మార్చడం చంద్రబాబు కు తగదన్నారు టిడిపి పార్టీకి మెజారిటీ ఇచ్చిన ఈ ప్రాంత ప్రజలు ద్రోహం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు కరువు సీమలో హైకోర్టు ఏర్పాటు చేయకపోవడమే కాకుండా, ఉన్న న్యాయ సంస్థలను అమరావతికి తరలించకపోవడం, దుర్మార్గమైన చర్యని ఆయన మండిపడ్డారు.రాయలసీమలో ఉన్న అరకొర సంస్థలను అమరావతికి తరలించక పోవడం శోచనీయ మన్నారు చంద్రబాబు పరిస్థితి ఇలాగే కొనసాగితే తమ పార్టీ ఆధ్వర్యంలో సీమకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తామని, చైతన్య పరుస్తామని, ప్రత్యక్షంగా ఆందోళనలు చేపడతా మని ఆయన హెచ్చరించారు .కార్యక్రమంలో ఆర్ సి పి నగర కార్యదర్శి మక్బూల్ బాషా, మడగలం ప్రసాద్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మార్పీఎస్ సత్కార్ మహాసభకు తరలిన మాదిగలు



**హిందూపురం, నవంబర్ 15 (ఆంధ్ర పత్రిక) :** అనంతపురం పట్టణంలో జరుగు ఎమ్మార్పీఎస్ సత్కార మహాసభకు హిందూపురం నుండి భారీగా మాదిగలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి జిల్లా ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి గోళ్ళాపురం గంగాధరప్ప ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జై మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు ఆర్ జె ప్రకాష్ మాదిగ నాయకత్వం వర్ధిల్లాలి అని నినాదాలు చేస్తూ టాటా సుమో వాహనాల్లో అనంతపురం పట్టణానికి తరలి వెళ్లారు. ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు ఆర్.జె. ప్రకాష్ మాదిగ సత్కర్ మహాసభలో పాల్గొని మాదిగల అభివృద్ధి గురించి ప్రసంగించడం జరుగుతుందని గోళ్ళాపురం గంగాధర్ తెలిపారు. మాదిగల అభ్యున్నత కోసం అనేక పోరాటాలు,ఉద్యమాలు చేసిన కెవిఎస్ బాబు ఆశయానికి అనుగుణంగా ఆర్.జె.ప్రకాష్ మాదిగల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని సుప్రీంకోర్టులో ఫీల్ దాఖలు చేశారని తద్వారా అత్యున్నత సుప్రీం కోర్ట్ న్యాయస్థానం మాదిగల సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఎస్సీ రిజర్వేషన్ కు అనుకూలంగా తీర్పు ఇవ్వడం జరిగిందన్నారు.

## అధిక పరీక్ష ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు

### పిడియస్ యు జిల్లా కార్యదర్శి జి.శ్రీనాథ్ యాదవ్



కడప నవంబర్ 15 (ఆంధ్ర పత్రిక): కడప జిల్లాలో ఇంటర్ పరీక్ష ఫీజు పదవ తరగతి పరీక్ష ఫీజు పేరుతో ఇంటర్ బోర్డు మరియు పాఠశాల విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా పరీక్ష నిర్ణయించిన ఫీజు కంటే అధికంగా వసూలు చేస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలు జూనియర్ కళాశాలలను నియంత్రించడంలో డీఈవో మీనాక్షి, ఆర్ఐఓ వెంకటసుబ్బయ్యలు విఫలం చెందారని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్ యు జిల్లా కార్యదర్శి జి.శ్రీనాథ్ యాదవ్ మండిపడ్డారు. శుక్రవారం కడప నగరంలోని ప్రగతి నర్సింగ్ హోమ్ లో పిడియస్ యు జిల్లా కార్యదర్శి జి. శ్రీనాథ్ యాదవ్ మాట్లాడుతూ జిల్లాలో కడప నగరం, ప్రొద్దుటూరు బద్వేలు వేంపల్లె,జమ్మలమడుగు, మైదుకూరు, పులివెందల ప్రాంతాల్లో ఇంటర్ బోర్డు మరియు పాఠశాల విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా పరీక్ష ఫీజు కార్పొరేట్ ప్రైవేట్ పాఠశాలలు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు అధికంగా వసూలు చేస్తున్నారని ఎటువంటి రసీదు కూడా విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్ర ఇంటర్ బోర్డు పాఠశాల విద్యాశాఖ నిర్ణయించిన ఫీజు ప్రకారమే ప్రవేట్ జూనియర్ కళాశాలల పాఠశాలల యాజమాన్యాలు తీసుకునేటట్లు ఇంటర్ అధికారులు మరియు జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్వయాన విద్యార్థుల దగ్గరికి వెళ్లి ఆకస్మిక తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పిడియస్ యు నగర నాయకుడు మనోజ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# చట్టాలు, బాలల హక్కులపై అవగాహన సదస్సు









చెన్నేకొత్తపల్లి నవంబర్ 15( అంధ్రపత్రిక ) : బాలల హక్కుల పరిరక్షణ కొరకు బాలల చట్టాలు బాలల హక్కుల వారోత్సవాలు దత్తత మాసంను పురస్కరించుకొని శుక్రవారంనాడు మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ శ్రీ సత్య సాయి జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీమతి సుధా వరలక్ష్మి ఆదేశాల మేరకు జిల్లా బాలల పరిరక్షణ విభాగం వారు అలాగ్ చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ జిల్లా కో ఆర్డినేటర్ సి కొండప్ప తో కలసి మండల కేంద్రమైన చెన్నేకొత్తపల్లి లోని కస్తూరిబా బాలికల పాఠశాల యందు బాలల హక్కులు అలాగే చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగా పిల్లల ద్వారా బాల్య వివాహాలు వలన అనర్ధాలు, అమ్మాయి చదువు ఆవశ్యకత అంశాల పై నాటికను పిల్లలు ప్రదర్శించడం జరిగినది అలాగే 'శోధించడం'అను చిన్న ఆట ద్వారా బాల్యవివాహాలపై అవగాహనను కల్పించడం జరిగినది, తదుపరి పాఠశాలలో ఈ సంవత్సరంలో స్పోర్ట్స్ నందు ,, విద్యా నందు ఉత్తమ ప్రతిభ కనబరచిన ముగ్గురు అమ్మాయిలకు పూజిత, హిందూ, మౌనికకు బహుమతులను అందజేయడం జరిగినది ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం నుండి ప్రొటెక్షన్ ఆఫీసర్ నాగలక్ష్మి, తిరుమల ఆనంద్, సిఐఎఫ్ కోఆర్డినేటర్ కొండప్ప, స్థానిక ఐసిడిఎస్ సూపర్వైజర్ లు విజయలక్ష్మి,, అరుణ, పాఠశాల ప్రిన్సిపాల్ సువర్ణ , పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# కార్తీక మాసం విశిష్టత



దేవనకొండ, నవంబర్ 15 (ఆంధ్రపత్రిక): కార్తిక మాసం పౌర్ణమినాడు చం ద్రుడు కృత్తికా నక్షత్రంలో ప్రవేశిస్తాడు. కృత్తిక నుంచి కార్తిక ఈ మాసం కార్తిక మాసంగా పవిత్ర మయింది. ఆదిదేవునికి ఎంతో ప్రీతికరం. శివుడు, గంగాదేవి, పార్వతిదేవికి ఇష్ట మెన మాసం. ఈ మాసంలో వ్రతాలు నోములు ఉపవాసాలతోపాటు దీపారాధనకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. దీపం పర బ్రహ్మ స్వరూపం. ఈశ్వరుడు తేజోమయ మూర్తి. ఆయన కాంతి సోకినప్పుడు మన లోని అజ్ఞానాంధకారాలు తొలగిపోతాయి. 'పరం జ్యోతి'ని ఆరాధన చేస్తున్నామనే అం తర సంస్కారాన్ని కార్తిక దీపం ఉద్దీపనం చేస్తుంది. దీపానికి అంతటి శక్తి ఉంటుంది. ప్రత్యేకించి కార్తిక మాసంలో ఆవునేతితో దీపారాధన అత్యంత పుణ్యదాయకం. కార్తికమాసం మొదటిరోజున దేవాల యాల్లో ఆకాశదీపం వెలిగిస్తారు. ధ్వజస్తం భానికి తాడుకట్టి, చిన్న పాత్రలో దీపం వెలి గించి పైకెత్తుతారు. ఆ దీపం ధ్వజస్తంభంపై వెలుగుతూ ఈశ్వరునికి ఉత్సవం నిర్వహి స్తుందనే భావనతో ఇలా చేయడం ఆచారం. పరమ పవిత్రమైన కార్తిక మాసంలో సూర్యోదయానికి ముందే స్నానం చేసి ఆల యాలలో, ఇంట్లో తులసికోట దగ్గర ఆవునే యితో దీపాలు వెలిగించడం, సాయం సం ధ్యలో కూడా దీపాలు వెలిగించి శివుడిని పూజిస్తే పుణ్య ఫలం లభిస్తుంది. చైతన్యానికి ప్రతీక అయిన దీపానికి ఈ మాసంలో ఆధ్యాత్మిక తత్వంలో విశిష్ట స్థా నం వుంది. ప్రతిరోజు ఉదయం, సాయం త్రం దీపాలు పెట్టమేకాకుండా క్షీరాబ్ది ద్వా దశి,కార్తీక పౌర్ణమి రోజులలో దీపాలను వెలి గిస్తే సర్వపాపహరణం, సర్వదోష నివార ణం అయి పరమేశ్వరుని కృపకు పాత్రుల వుతారని కార్తిక పురాణం చెబుతుంది. అంత విశిష్టమై దీపం పరబ్రహ్మ స్వరూ పం. పరమేశ్వర అనుగ్రహాన్ని ప్రసాదించే మహామాన్వితమైన దివ్యారాధన దీపారా ధన. త్రికరణశుద్ధిగా భక్తిభావంతో చేసే దీపా రాధన పాపాలను హరించి సకల సౌభా గ్యాలను కలిగిస్తుంది. భగవంతుని అనుగ్ర హాన్ని పొందడానికి, దివ్య జ్ఞానాన్ని సము పార్జించడానికి ఆత్మజ్ఞానాన్ని అర్థం చేసుకో వడానికి దీపారాధన ఒక పవిత్ర సోపానం. చంచలమైన మన మనస్సును పరమా త్ముని ముందుంచి నిశ్చలమైన ధ్యానదీపం వైపు మళ్లిస్తే.. మన మనస్సు కూడా నిశ్చల మై.. భగవధ్యానంలో నిమగ్నమవుతుంది. దీపారాధన చేయడం అంటే ఆ భగ వంతుని ఆరాధించడమే. ఈ నెల రోజులు దీపాన్ని వెలిగిస్తే తెలిసీ తెలీక చేసే పాపాలన్నీ హరించు కుపోయి మహాశివుని అనుగ్ర హం లభిస్తుంది. ఈ మాసంలో శివాలయంలో దీపాలు వెలిగించి నా, ఇంట్లోనే దేవుని ముందు లేదా తులసికోట ఎదుటదీపం వెలిగించినా మంచి ఫలితం ఉం టుంది. శివాలయంలో దీపారాధ న చేయడమంటే ముక్కోటి దేవ తలను పూజించడమే అంటారు. సకలపు ణ్య నదులలో స్నానంచేసిన ఫలం వస్తుంది. ఈ మాసంలో గృహిణులు, యువతులు వేకువనే స్నానం చేసి తులసికోట ముందు దీపారాధన చేసి గౌరీదేవిని పూజిస్తే ఈశ్వరా నుగ్రహంతోపాటు సౌభాగ్యాన్ని, సకల శుభా లను పొందుతారు. మాసమంతా స్నాన విధిని పాటించలేనివారు పుణ్యతిథులలో నైనా స్నానం ఆచరించాలి. ఉపాసనా శక్తిని పెంచుకోవడానికి కార్తిక మాసం అనుకూలమైన సమయం. అలాగే శివకేశవుల ప్రీతికి దీపదానం చేస్తారు.

# లయన్స్ క్లబ్ సభ్యులచే అన్నదానం





**వి.కోట నవంబర్ 15 (ఆంధ్ర పత్రిక) :** చిత్తూరు జిల్లా వి.కోట పట్టణంలో అంతర్జాతీయ సేవా సంస్థ లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ అన్నదాన సేవా కార్యక్రమాన్ని చేపట్టింది.స్థానిక కేజియఫ్ బస్టాండు వద్ద తమ సభ్యుల జన్మదినోత్సవాలను పురస్కరించుకుని ప్రతినెలా 15వ తేదీ మధ్యాహ్నం జరిగే ఈ కార్యక్రమంలో 800 మందికి అన్నప్రసాద వియోగం జరిగిందని క్లబ్ అధ్యక్షుడు ఆర్ ధీరజ్, కార్యదర్శి మురుగేష్ తెలిపారు. నవంబర్ నెలలో పుట్టినరోజు జరుపుకుంటున్న లయన్స్ ఆర్సీ డా.నాగభూషణం, డా. లాబురాం, రామ్ స్వరూప్, మోహన్ రెడ్డి ,నరేంద్ర రెడ్డిల సహకారంతో జరిగిందని తెలిపారు. సభ్యులు మాట్లాడుతూ అన్నిదానాలకన్న గొప్పదైన అన్నదానం చేయడం ఎంతో సంతోషదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జి ఎం టి మెంబరు డా.ఎమ్ సీ సురేంద్ర గౌడ, జోనల్ ఛైర్ పర్సన్ ఎన్ ఆర్ లోకేష్, సర్వీస్ కమిటీ ఛైర్మన్ సబ్బా రెడ్డి, క్లబ్ ఉపాధ్యక్షులు డా.తమీమ్ ఖాన్, తుకారాం, సభ్యులుగిరి, చేనారం ,కేశవరెడ్డి, హర్ష, హరినాథ్, రమేష్ బాబు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై మాట్లాడలేని
# ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలి




బద్వేలు నవంబర్ 15 (ఆంధ్రపత్రిక) ప్రజా సమస్యలపై స్పందించని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధా ఎమ్మెల్సీ డి.సి. గోవింద రెడ్డి తమ పదవులకు రాజీనామా చేయాలని జనసేన బద్వేలు నియోజకవర్గ సమన్వయకర్త బసవి రమేష్ అన్నారు. శుక్రవారం జనసేన పార్టీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ బద్వేలు నియోజకవర్గ ప్రజలు ఓట్లు వేసి గెలిపిస్తే కనీసం బద్వేలు రెవిన్యూ డివిజన్ పరిధిలోని ప్రజా సమస్యలపై అసెంబ్లీలో జరుగుతున్న బడ్జెట్ సమావేశాలలో పాల్గొనకుండా ఈ ప్రాంత ప్రజలకు ఏమి కావాలో శాసనసభలో ప్రశ్నించకుండా తమ సొంత పనులు చేసుకుంటూ ప్రజా సమస్యలను విస్మరించిన ఎమ్మెల్యే డాక్టర్ సుధా ఎమ్మెల్సీ డి.సి.గోవిందరెడ్డితమ పదవులకు రాజీనామా చేయాలని వారన్నారు. కడపలో సంసారం ఉంటూ ప్రజా సమస్యలను గాలికి వదిలేసి తన సొంత హాస్పిటల్ లో కూర్చొని రోజు లక్షలు సంపాదిస్తూ తనను గెలిపించిన ప్రజలను పట్టించుకోకుండా బద్వేలు ప్రజల సమస్యలను గాలికి వదిలేసిన ఎమ్మెల్యే ఇప్పటికైనా బడ్జెట్ సమావేశాలలో పాల్గొని ప్రజా సమస్యలపై గళం మెత్తలని జనసేన సమన్వయకర్త బసవి రమేష్ అన్నారు.ఈ కార్యక్రమంలో గోపవరం మండలం అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి జనసేన కార్యకర్తలు మనోహర్ రెడ్డి వెంకటసుబ్బయ్య తరుణ్ అనిల్ కుమార్ జనసైనికులు పాల్గొన్నారు.

# లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



**కల్లూరు, నవంబర్ 15 (ఆంధ్రపత్రిక) :** పులిచెర్ల మండలం దేవళంపేట శ్రీ లక్ష్మీనర సింహస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనం తరం అర్చనలు పూజలు జరిపి నైవేద్యం సమర్పించి మహా మంగళహారతి గావించారు ఆలయ ప్రధాన అర్చకులు అనంత కుమారాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామివారిని దర్శించు కున్నారు.

# రామకుప్పం నూతన ఎస్సై వెంకట మోహన్ కలిసిన ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ నాయకులు



**రామకుప్పం నవంబర్ 15 (ఆంధ్ర పత్రిక) :** రామకుప్పంకు నూతన ఎస్సైగా బాధ్యత స్వీకరించిన వెంకట మోహన్ నిలిఎమ్మార్పీఎస్ ఎంఎస్పిలిరామకుప్పం మండలంసీనియర్ నాయకులు వెంకటేష్ మాదిగలిమండల ఎంఎస్పి అధ్యక్షులు గోవింద మాదిగలివీర ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలులిఎస్సై వెంకట మోహన్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంతకు ముందు తిరుపతి లోవిధులు నిర్వహిస్తున్న ఎస్సై ను రామకుప్పం కు బదిలీ చేశారు.రామకుప్పంమండలంలోని శాంతిభద్రతలకు విఘతాం కలిగిచకుండా గంజాయి, అక్రమ మద్యం రవాణా వంటి విషయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో కుప్పం సీనియర్ నాయకుడు పాపన్న మాదిగలిశాంతిపురం సీనియర్ నాయకుడు నారాయణ మాదిగ.ఎమ్మెస్పీ మండల ప్రధాన కార్యదర్శి జయప్ప మాదిగ. మాజీ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రామకృష్ణ మాదిగ. ఉదయ్ కుమార్ మాదిగ. యూత్ నాయకుడు పలని మాదిగ. బాబు. అమర్నాథ్. భాను ప్రకాష్ . లక్ష్మణ్. చిన్న నాగ. గోవిందప్ప. పెద్ద నాగ. ఈ కార్యక్రమంలో మండలంలోని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నాయకులు పాల్గొన్నారు

# రామకుప్పంలో మాజీ సర్పంచ్ కుటుంబం కిడ్నాప్ కలకలం

## కిడ్నాపర్లు రివాల్వర్ చూపి బెదిరింపు

## పోలీసుల జోక్యంతో కిడ్నాపర్లు పరార్



**రామకుప్పం, నవంబర్ 15 (ఆంధ్ర పత్రిక) :** రామకుప్పం మండల పరిధిలోని బల్ల పంచాయితీ పెద్ద కురుబలపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్ కుటుంబం కిడ్నాప్ ఆయన సంఘటన మండలంలో కలకలం రేపింది. స్థానికుల కథనం మేరకు పెద్ద కురబలపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మాధవి గోవిందప్ప కుటుంబ సభ్యులను గురువారం రాత్రి సుమారు 11 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు పదిమంది మూడు వాహనాలు వచ్చి గోవిందప్ప ఇంటి తలుపులు తీయమని అతని మీద రివాల్వర్ గన్ను చూపి ఇన్కమ్ టాక్స్ అధికారులమంటూ బెదిరించారు. ఈ కిడ్నాప్ లో తండ్రి సిద్ధప్ప, తల్లి సుబ్బమ్మ, భార్య మాధవి,కుమారుడు పునీత్ కుమార్, తమ్ముడి కుమారుడు సోమశేఖర్ లను అరుపులు చేస్తే చంపేస్తామంటూ మూడు వాహనాలు తీసుకొని రామకుప్పం వైపు తీసుకొచ్చారు. మార్గమధ్యమైన బందార్లపల్లి క్రాస్ వద్ద స్థానిక పోలీసులు వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా కిడ్నాపర్లు అప్రమత్తమై గోవిందప్ప కుటుంబీకులను అక్కడే వదిలేసి పరారయ్యారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వాల్మీకి బోయ ఫెడరేషన్ చైర్మన్‌ను అభినందించిన టీడీపీ నాయకులు



**దేవనకొండ నవంబర్ 15 (ఆంధ్రపత్రిక) :** వాల్మీకి బోయ ఫెడరేషన్ చైర్మన్ ను టిడిపి రాష్ట్ర నాయకులు వైకుంఠ శివప్రసాద్, బంటుమిల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయ కులు పురుషోత్తం గౌడ్ లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలతో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కప్పటాల వెంకటప్ప నాయుడు జీవితమంతా టిడిపికే సేవ చేశారని దాని విడవకుండా మీరు కూడా టీడీపీ పార్టీకి గత ఎన్నికలలో పార్టీకి విస్తృతంగా ప్రచారం చేసి అభ్యర్థి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసినందుకు టిడిపి అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుర్తించి వాల్మీకి బోయ ఫెడరేషన్ చైర్మన్గా బాధ్యతలు అప్పగించారని మీకు మరింత బాధ్యత పెరిగిందని ఈ ఫెడరేషన్ ద్వారా వాల్మీకులకు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రామాజినేయులు గౌడు, ఈరయ్య గౌడు, విరంజినేయులు గౌడు, ఉమేష్ గౌడు, రమేష్ గౌడు, సూరి గౌడు, రామ గౌడు, అవినాష్ గౌడు, దొరస్వామి మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా కార్తీక పౌర్ణమి లక్షదీపోత్సవం





**హిందూపురం, నవంబర్ 15 (ఆంధ్రపత్రిక) :** కార్తీక పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని కొటిపి రోడ్డు మోడల్ కాలనీలో వెలసిన శ్రీ జలకంఠేశ్వర స్వామి, శ్రీ గంగమ్మ దేవస్థానంలో బెస్త సేవా సంఘం ఆధ్వర్యంలో లక్ష దీపోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. శివకేశవులకు పవిత్ర మాసం అయినందున అధిక సంఖ్యలో భక్తాదులు,మహిళలు ఉపవాసంతో పాల్గొని శివనామ స్వరంతో జ్యోతులను వెలిగించి తమ మొక్కులను తీర్చుకున్నారు.అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ చైర్మన్ బెస్త లక్ష్మీనారాయణ, కమిటీ ప్రతినిధులు శ్రీనివాసులు, సిరికల్చర్ లక్ష్మీనారాయణ, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సోమలలో ముగిసిన అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం



**సోమల. నవంబర్ 15 (ఆంధ్ర పత్రిక) :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి న అనంతరం ప్రతి గ్రామంలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందజేయాలని, అదేవిధంగా అభివృద్ధి పనులు ముమ్మరంగా చేపట్టాల్సిన చర్యలపై మండలం లో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎం.పి.పి.,జెడ్పీటీసీ, ప్రాదేశిక సభ్యులు, మరియు సర్పంచ్ లకు అధికారులు కు,డిజిటల్ అసిస్టెంట్ లకు జిల్లా స్థాయి అధికారులతో సోమల మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో సమావేశంను అభివృద్ధి అధికారి నారాయణ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమంను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు ఈశ్వరయ్య, వైస్,ఎం.పి.పి. ప్రభాకర్ మాట్లాడుతూ అధికారులు ఆయా గ్రామంలో పర్యటించి ప్రభుత్వ ఆదేశించిన ప్రకారం అభివృద్ధి కార్యక్రమాలుపై దృష్టి సారిం చాలని సూచించారు.

# మాదక ద్రవ్యాలపై అవగాహన




ఎమ్మిగనూరు, నవంబర్ 15 (ఆంధ్ర పత్రిక): పట్టణంలోని ప్రభుత్వ శాఖ గ్రంధాలయం నందు వారోత్సవాలు పురస్కరించుకుని శుక్రవారం గ్రంథాలయం ఇన్చార్జి హరికృష్ణ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలపై విద్యార్థీనీలకు అవగాహన కల్పించడం జరిగింది. అనంతరం ప్రభుత్వ కళాశాల విద్యార్థులు పుస్తక ప్రదర్శన కార్యక్రమానికి హాజరయ్యారు.విద్యార్థినీలు ఎంచుకొన్న పుస్తకాన్ని తోటి విద్యార్థినీలతో తమ పుస్తక అనుభవాలు పాలుపంచుకొన్నారన్నారు. అనంతరం కళాశాల ఉపాధ్యాయులు హరి కుమార్ మాట్లాడుతూ పుస్తకాలు చదివి పరిజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. పుస్తకాలు ద్వారా ఉపయోగాలు వున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

## హిందూపురం అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ
# కోఆర్డినేటర్‌గా కిఫాయతుల్లా



**హిందూపురం, నవంబర్ 15 (ఆంధ్ర పత్రిక) :** రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు షర్మిల శ్రీ సత్యసాయి జిల్లాలో గల ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు గాను ఐదింటికి కోఆర్డినేటర్లను నియమించారు. అందులో హిందూపురానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ కోఆర్డినేటర్ గా యం.ఈ.కిఫాయతుల్లాను అధిష్టానం ప్రకటించింది. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ నాపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నాయకులు, పిసిసి అధ్యక్షురాలు షర్మిలమ్మ,శ్రీ సత్య సాయి జిల్లా డిసిసి అధ్యక్షులు యం.యచ్ ఇనాయతుల్లాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నా వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. రాబోవు రోజులలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో షర్మిలమ్మ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ పూర్వ వైభవానికి తీసుకురావడానికి ఎనలేని కృషి చేస్తానన్నారు.

# వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ కోసం ఉద్యమించాలి

## నందికొట్కూరు నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు గుజ్జల గౌరీశ్వర నాయుడు



**నందికొట్కూర్, నవంబర్ 15 (ఆంధ్ర పత్రిక) :** వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణకు, చట్టబద్ధత సాధించుకునేంతవరకు వాల్మీకులు ఉద్యమించాల్సిన అవసరం ఉందని నందికొట్కూర్ వాల్మీకి సంఘం కార్యవర్గ సభ్యులు గుజ్జల గౌరీశ్వర నాయుడు, పిలుపునిచ్చారు, నందికొట్కూర్ లో ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 17న ఆదివారం ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా మదనపల్లె లో నిర్వహిస్తున్న వాల్మీకుల రాష్ట్రస్థాయి వర్క్ షాప్ సమావేశమునకు వాల్మీకులంతా ఉమ్మడిగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు, ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ కోసం ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం దశాబ్దాలుగా ఉద్యమాలు నిర్వహిస్తున్నామన్నారు, ఎస్టి రిజర్వేషన్ కు నోచుకోకపోవడంతో రాజకీయంగా, ఆర్థికంగా, విద్య ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో వాల్మీకులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఆయన ఆవేదన వ్యక్తం చేశారు, ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ చేస్తేనే వాల్మీకులకు న్యాయం జరుగుతుందని, ఇందుకోసం కూటమి పార్టీలపై ఒత్తిడి తీసుకురా వాలన్నారు, ఎస్టి రిజర్వేషన్ పునరుద్ధరణ సాధనకు అందరు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు, ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ సాధించుకొని, చట్టం భద్రత కల్పించుకోవడమే మన ముఖ్య ఉద్దేశం అన్నారు, రాష్ట్రస్థాయి వాల్మీకుల వర్క్ షాప్ కు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో వాల్మీకి బోయ సంఘం నాయకులు, పసుపుల శ్రీనివాసులు నాయుడు, నల్లబోతుల రాజశేఖర్, మాండ్ల మహేష్, ఎం బి, రాంబాబు నాయుడు, మద్దిలేటి దర్గయ్య, పుల్లయ్య బోయ శ్రీకాంత్, కుల పెద్దలు, వాల్మీకి యువత తదితరులు పాల్గొన్నారు

# గ్రామా పంచాయతీల అభివృద్ధికి సమన్వయంతో కృషి చేయాలి



**కల్లూరు, నవంబర్ 15 (ఆంధ్రపత్రిక) :** పుంగనూరు నియోజకవర్గం పులిచెర్ల గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు ఉద్యోగులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీడీవో రాజశేఖర్ బాబు అన్నారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీల అభివృద్ధిపై అధికారులు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్ బాబు మాట్లాడుతూ గ్రామాలలో ప్రజాప్రతినిధులు ఉద్యోగులు సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సమస్యల గుర్తించి వాటి పరిష్కారానికి ముందుండాలని అన్నారు. తహశీల్దార్ జయసింహ మాట్లాడుతూ గాంధీజీ కలల కన్నా గ్రామ స్వరాజ్యానికి గ్రామాలే పునాది అని వీటి అభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్రనాథ్ రెడ్డి సర్పంచులు ఎంపీటీసీలు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# సకాలంలో అన్నీ రకాల పన్నులు తప్పక చెల్లించి పురపాలక సంఘం అభివృద్ధికి సహకరించండి

## వి.వి.నరసింహరెడ్డి కమీషనర్, బద్వేల్ పురపాలక సంఘం




బద్వేలు నవంబర్15 (ఆంధ్రపత్రిక): పురపాలక సంఘంలో పురపాలక రెవిన్యూ అధికారులతో మరియు అందరూ సెక్రెటరీస్ తో మరియు బిల్ కలెక్టర్ లతో సమీక్ష సమా వేశం నిర్వహించిన మునిసిపల్ కమీషనర్. పన్ను బకాయిదారులు అన్నీ రకాల పన్నులు సకాలంలో చెల్లించి పురపాలక సంఘం అభి వృద్ధికి తోడ్పడాలని కోరారు. ప్రభుత్వ ఆఫీసు లుకు సంబంధించి వారి పై అధికారులకు తెలిపి బడ్జెట్ రిలీజ్ చేయించుకోని సకాలంలో పన్నులు చెల్లించాలి. ఒక్కప్రభుత్వ కార్యాలయాల నుండే కోటి అరవై ఒక్క లక్షలు పెండింగ్ ఉన్నదని తెలిపారు. పన్నులు చెల్లించాలని రెండో నోటిసు కూడా ఇస్తున్నామనీ తెలిపారు.పెద్ద మొత్తము ఉన్న100 మంది బకాయిదారులు నుండి 85లక్షలు రావలసి ఉండగా నోటీసులు ఇవ్వగా కొంతమంది చెల్లించారు. మిగిలినవారికి కూడా సెకండ్ నోటీసు ఇస్తున్నామని అన్నారు.అక్రమ కుళాయిలన్నీ కూడా రెగ్యులర్ చేయించుకోవాలని తెలిపారు. జియో ట్యాగింగ్ చేపించడానికి సెక్రెటరీస్ మీ ఇంటి దగ్గరికి రావడం జరుగును కావున వారికి మీ యొక్క తగిన సమాచారం అందిచి సర్వే చేపించుకోవలెను.అలాగే ఆధార్ ఎన్.పి.సి.ఐ లింక్ చేపించడానికి ప్రత్యేక కౌంటర్ మునిసిపల్ ఆఫీస్ నందు ఏర్పాటు చేయడం జరిగింది అలాగే సచివాలయ సిబ్బందికి ఎన్.పి.సి.ఐ లింక్ కానీ లబ్ధిదారులను ఆఫీస్ దగ్గరికి పంపేల చర్యలు తీసుకోవాలని సెక్రెటరీ లకు సూచనలు ఇచ్చిన మునిసిపల్ కమీషనర్ ఈకార్యక్రమంలో టీపీఓ సతీష్ రెవిన్యూ అధికారి రఘునాథరెడ్డి ఆర్ ఐ షఫీ మరియు ఖాజా టీపీబిఓ నరసయ్య పాల్గొనడం జరిగింది.

# వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్‌గా బేవనహళ్లి ఆనంద్



**హిందూపురం, నవంబర్ 15 (ఆంధ్ర పత్రిక) :** రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్గా టీడీపీ నాయకులు బేవనహళ్లి ఆనంద్ ను ఎంపిక చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో అయన సర్పంచ్ గా, పార్టీకి అందించిన సేవలను గుర్తించి ఉన్నత స్థాయి పదవిని టీడీపీ అధిష్టానం అప్పగించింది. దింతో అయన సీఎం చంద్రబాబు నాయుడుకు, ఎమ్మెల్యే బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాల్మీకుల అభ్యున్నతి కోసం కృషి చేస్తానని, పార్టీ మరింత బలోపేతం కోసం కృషి చేస్తానని అయన తెలిపారు.

# శ్రీ విరుపాక్షమ్మకు కార్తీక పౌర్ణమి పూజలు

**కల్లూరు, నవంబర్ 15 (ఆంధ్రపత్రిక) :** దపులిచెర్ల మండలం దేవళంపేట పంచాయతీ దిగువ మూర్తి వారి పల్లెలో వెలసిన శ్రీ విరూపాక్షమ్మ ఆలయంలో కార్తీక పౌర్ణమి శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలం కరించారు. అనంతరం అర్చనలు, పూజలు జరిపి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మహా మంగళారతి గావించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో కార్తీక వనభోజనం కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు చీమలమర్రి గురుస్వామి, అరుణ దంపతులు , మల్లికార్జున, హరిత కుటుంబ సభ్యులు భరత్ కుమార్, మునికృష్ణ కుటుంబ సభ్యులు, శ్రీధర్ కుటుంబ సభ్యులు తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



# శివాకేశవలయంలో సహస్ర దీపాలంకరణ

## శంకర్ దేవాలయం నందు ఆకాశ జ్యోతి దర్శనం





**దేవనకొండ నవంబర్ 15 (ఆంధ్ర పత్రిక) :** కార్తీక మాస వేకువ జామన స్నానం, చేసి కార్తీకమాస దీపజ్యోతి దర్శనం చేయడం హిందువుల మహిళలకు ఆనవాయితీగా వస్తున్న ఆచారం. దీపజ్యోతి పరబ్రహ్మ స్వరూపం ఈశ్వరుడు తెజోమయ మూర్తి దీప దర్శనం శివ కేశవులు లకు అత్యంత ప్రతికరం. దేవనకొండ మండల కేం ద్రంలో కార్తీక మాసం న పురస్కరించుకొని పౌర్ణమినందు శివాలయము, సుంకులా,పరమేశ్వరి ఆలయాల నందు శివకేశవుల ఆలయం,నందు సహస్ర దీపాలంకరణ వివిధ రూపాలతో మహిళలు స్నానమాచరించి భక్తిశ్రద్ధలతో దీపాలంకరణలు చేసి శివకేశవులకు మంత్రముగ్ధులైనరు.

శంకర్ దేవాలయం నందు శివపార్వత రూపాలతో సహస్ర దీపాలంకరణ చేసి భక్తులకు దర్శనమిచ్చి ధ్వజస్తంభనందు ఆకాశదీపం వెలిగించి శంకరునికి ఉత్సాహపరిచినట్లు భక్తుల ప్రతీక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని చేసుకున్నారు.

# టీటీడీ ప్రాణదాన ట్రస్టుకు రూ.50 లక్షలు విరాళం



**తిరుమల, నవంబర్ 15 (ఆంధ్ర పత్రిక) :** బెంగళూరుకు చెందిన బీ.ఎం.కే.నగేష్ అనే భక్తుడు శుక్రవారం టీటీడీ ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.50 లక్షలు విరాళంగా ఇచ్చారు. ఆ మేరకు దాత డీడీని టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి చేతుల మీదుగా తిరుమలలోని వారి క్యాంపు కార్యాలయంలో అందజేశారు.ద

# తిరుమలలో వైభవంగా పున్నమి గరుడ సేవ



**తిరుమల, నవంబర్ 15, (ఆంధ్ర పత్రిక) :** అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సన్నిధి యందు శుక్రవారం రాత్రి 7 గంటలకు వైభవంగా పున్నమి గరుడ సేవను టీటీడీ నిర్వహించింది. కార్తీక పౌర్ణమి సందర్భంగా పున్నమి గరుడసేవను తిరుమల తిరుపతి దేవస్థానం అంగరంగ వైభవం గా ఏర్పాటు చేశారు. శ్రీ మల్లప్ప స్వామి వారు విశేష ఆభరణాల అలంకృతుడై, గరుడ వాహనంపై ఆసీనులై, తిరుమల వీధులలో భక్తులను కటాక్షించారు. ఈ వాహన శ్రేనిలో ముందువైపు గజాలు, కోలాటాలు, వివిధ కళా బృందాల కలా ప్రదర్శనలు, వంది మాగాధులు, వెంటరాగ వేద పండితులు వేద ఘోష మధ్య గరుడ వాహన శ్రేణి తిరుమల మాడ వీధులలో వైభవంగా ఊరేగుతూ, భక్తులను కటాక్షించారు. ప్రతి ఏటా జరిగే బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రధా నమైంది, పవిత్రమైనది, గరుడ సేవ. ఈ గరుడ సేవ నాడు లక్షలాది మంది భక్తులు తిరుమల కు చేరుకుంటారు. బ్రహ్మోత్సవాల సమయంలో గడసేవను తిలకించలేని భక్తుల కోసం ప్రతి పున్నమి రోజున గరుడ సేవను టీటీడీ ఏర్పాటు చేసింది. కాగా శుక్రవారం నాడు కార్తీక పౌర్ణమి సందర్భంగా ఏర్పాటు చేసిన గరుడ సేవ భక్తుల గోవింద నామ స్మరణల మధ్య వైభవంగా సాగింది. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు కార్య నిర్వహణ అధికారి వెంకయ్య చౌదరి తో పాటు, ఆలయ ఉప కార్య నిర్వహణ అధికారి లోకనాథం తదితర అధికారులు పాల్గొన్నారు.

# డోన్‌లో ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

- భక్తిశ్రద్ధలతో జ్వాలాతోరణం
- ఆకట్టుకున్న 1008 జ్యోతుల శివ లింగం





**డోన్, నవంబర్ 15, (ఆంధ్ర పత్రిక):** కార్తీకమాసంలో ఎంతో పవిత్రమైన కార్తీక పౌర్ణమి వేడుకలను శుక్రవారం డోన్‌లో ఘనంగా జరుపుకున్నారు. నంద్యాల జిల్లా డోర్ పట్టణంలోని పాత బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షులు బైసాని నాగరాజ్ ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని శివపార్వతుల కళ్యాణాన్ని వందలాది మంది భక్తుల సమక్షంలో భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. అనంతరం సహస్రతీపోత్సవం, జ్వాలాతోరణం, పల్లకి సేవ కార్యక్రమాలను నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని పాతపేటలో గల శ్రీరాముల దేవాలయ ఆవరణలో ఆంజనేయ స్వామి, శివ దీక్షాపరుల ఆధ్వర్యంలో నిర్వహించిన జ్వాలతోరణ కార్యక్రమం భక్తులను ఎంత కట్టుకుంది. 1008 జ్యోతులతో లింగాకృత రూపంలో నిర్వహించిన శివలింగం, హిమ లింగాలను భక్తిశ్రద్ధలతో పూజించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా డోన్ పట్టణంలోని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడిపోయాయి. పాతపేట శివాలయం, వైయస్ నగర్ లోని శివాలయం పాత బస్టాండ్ లోని ముక్తేశ్వరాలయం, నెహ్రూ నగర్ లోనే ముక్తేశ్వరాలయం,పాత బుగ్గ రామలింగేశ్వర ఆలయం, కొత్తబుగ్గరామలింగేశ్వర ఆలయంతో పాటు పోలీస్ స్టేషన్ సమీపంలోని సాంబశివాలయాల్లో తెల్లవారుజాము నుంచే మహాదేవునికి అభిషేకాలు అర్చన లను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దీంతో శివాలయాలని భక్తులతో కిటకిటలాడిపోయాయి. శివాలయాలకు మహిళలు వారికి తరలివచ్చే కార్తీక దీపాలను వెలిగించడంతో కార్తీక శోభ వెల్లి విరిసింది. శివనామ స్మరణతో కార్తీక పౌర్ణమి రోజున శివాలయాలన్నీ మారుమ్రోగాయని చెప్పవచ్చు.

# మహిళా సాధికారతపై అవగాహన సదస్సు

## గోడపత్రికను ఆవిష్కరిస్తున్న రావుస్ యాజమాన్యం అధికారులు




**ఎమ్మిగనూరు, నవంబర్ 15, (ఆంధ్ర పత్రిక):** మహిళా సాధికారతపై అవగాహన సదస్సు శుక్రవారం రావూస్ కళాశాల యందు ఏర్పాటు చేయడం జరిగిందని కళాశాల సీఈఓ తిరుమల రెడ్డి.సిడిపిఓ సఫారీ నోసబేగంలు పేర్కొన్నారు. అనంతరం గోడ పత్రికను ఆవిష్కరించిన రావూస్ యాజమాన్యం. అధికారులు ఈ సందర్భంగా జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ లీగల్ ప్రొబెషన్ ఆఫీసర్ శ్రీలక్ష్మి, ఎమ్మిగనూరు ఐసిడిఎస్ సూపర్వైజర్ ఏ.సుధావతి, సిఆర్పిఎఫ్ జిల్లా కన్వీనర్ ఇ.లింగన్న మాట్లాడుతూ సమాజంలో ఆడపిల్లలకు రక్షణ కరువైందని ఆడపిల్లకు రక్షణ కల్పించడమే లక్ష్యంగా మహిళా శిశు సంక్షేమం కృషి చేస్తుందని కళాశాల మహిళా విద్యార్థులకు గుర్తు చేశారు. సమాజంలో బాల్యవివాహాలు, వరకట్నం, గృహహింస, పుట్టిన పసిగుడ్డునుండి వృద్ధాప్య మహిళ వరకు లైంగిక దాడులు, మహిళా కిడ్నాప్లు లాంటి అరాచకాల మధ్య ప్రతి మహిళ నలిగిపోతుందని వీటిని ఎదుర్కోవడానికి రాజ్యాంగం కల్పించిన వివిధ రకాలైన మహిళా చట్టాల ద్వారా రక్షణ పొందవచ్చని విద్యార్థులకు తెలియజేశారు. ప్రతి మహిళ వివిధ అరాచక దాడుల నుండి తన్ను తాను కాపాడుకోవడానికి 1098 టోల్ ఫ్రీ నెంబర్ కి కాల్ చేయ్యొచ్చని విద్యార్థులకు అవగాహన కల్పించారు. సమాజంలో ప్రతి మహిళ బేటి బచావో బేటి పడావో అనే నినాదంతోముందుకెళ్లాలన్నారు. మహిళకు విద్య ద్వారానే ధైర్యం, జ్ఞానం, మంచి ప్రవర్తన అలవర్తోందని విద్య పట్ల దృష్టి సారించాలని విద్యార్థులను కోరారు. నేటి సమాజంలో ఆడపిల్లల మీద జరుగుతున్న లైంగిక దాడులకు కారణాలు ప్రస్తుతం ఉన్న మొబైల్స్, వివిధ అశ్లీల చిత్రాలు, స్త్రీని భోగి వస్తువుగా చూడడం వల్లే ఇటువంటి అత్యాచారాలు జరుగుతు న్నాయని తెలిపారు. ఇటువంటి దాడుల నుండి రక్షించుకోవడానికి భారత రాజ్యాంగం ఫోక్సోచట్టం (లైంగిక నేరాలు నుంచి బాలికలను రక్షించే చట్టం – 2012), జెజె చట్టం(పిల్లల సంరక్షణ మరియు రక్షణ చట్టం– 2015), లాంటి చట్టాలు కల్పించిందని విద్యార్థులకు చట్టాలపట్ల అవగాహన కల్పించారు. మీ మీద దాడులు జరిగినప్పుడు ముందుగా తల్లిదండ్రులకు, ఆ తరువాత కళాశాల అధ్యాపకులకు తెలియజేయాలని కోరారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసినవారికి కళాశాల యాజమాన్యం చిరుసన్మానంతో సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఇర్ఫాన్, కల్చరల్ ప్రోగ్రామ్ ఇన్చార్జ్ విజయ్ కుమార్, స్క్రిప్ట్ రైటర్ పాలరాజ్, సీనియర్ అద్యాపకులు గోరంట్ల, మహిళా అధ్యాపకురాలు నందిని,అన్నపూర్ణ, శృతి ప్రియా,సంధ్య, ఈరేశ్వరి, లతోపాటు కళాశాల మహిళా విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే బివి



**ఎమ్మిగనూరు. నవంబర్ 15 (ఆంధ్ర పత్రిక):** అమరావతి సచివాలయం నందు శుక్రవారం ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి మర్యాద పూర్వకంగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ని కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి తో ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి ఎమ్మిగనూరు కేంద్రంగా కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి పత్రం సమర్పించారు.

# నారాయణస్వామిపై ఫిర్యాదు

**పాలసముద్రం నవంబర్ 15 (ఆంధ్ర పత్రిక):** మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎక్సైజ్ మంత్రి, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పై, పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు కేసు నమోదు చేయాలని జనసేన పార్టీ పాలసముద్రం మండల అధ్యక్షులు లతీష్ ఆధ్వర్యంలో పాలసముద్రం మండల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఈ కార్యక్రమంలో పాలసముద్రం మండల అధ్యక్షులు లతిష్, ఉపాధ్యక్షులు రాఘవ, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, నియోజకవర్గ యువజన కార్యదర్శి కోదండన్, ఆముదాల పంచాయితీ అధ్యక్షులు ప్రసాద్, ఆముదాల పంచాయితీ కార్యదర్శి గిరి, బాలకృష్ణ పురం పంచాయితీ అధ్యక్షులు హేమంత్ మరియు జనసైనికులు పాల్గొన్నారు.



# బద్వేలు మండలం రాజుపాలెంకు చెందిన బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య



**బద్వేలు నవంబర్ 15 (ఆంధ్రపత్రిక):** బద్వేలు మండలం రాజుపాలెం కు చెందిన బిజివేముల రామసుధ అనే బీటెక్ విద్యార్థిని అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు సెట్టిగుంట రైల్వే స్టేషన్ లో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. ఆత్మహత్యకు పాల్పడిన రామసుధ కొనఊపిరితో ఉండడం గమనించిన స్థానికులు ఆ అమ్మాయిని రైల్వే కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు విశ్వసీయ సమాచారం ఈ అమ్మాయి తిరుపతి కరకంబాడి శ్రీరామ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజీలో మూడవ సంవత్సరం బీటెక్ చదువుతున్నట్లు వారి బంధువులు తెలియజేశారు

# టీడీపీ సభ్యత్వ నమోదులో అట్లూరు ముందంజ



**అట్లూరు నవంబర్ 15 (ఆంధ్రపత్రిక):** అట్లూరు మండలంలోని టిడిపి సభ్యత్వ నమోదు నియోజకవర్గంలోని ముందంజలో ఉందని మండల టిడిపి నాయకులు మల్లికార్జునరెడ్డి తెలిపారు.శుక్రవారం అట్లూరు క్రాస్ రోడ్డు ఉప్పుటూరు కాలనీలలో ఇంటింటికి టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షులు మహేశ్వర్ రెడ్డి మండల యువ నాయకులు మస్తాన్ పరమేష్ బాబా చిన్నపరెడ్డి గంగిరెడ్డి నర్సారెడ్డి రిషికేశవ గోపాల్ సంజీవ్ టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# శృంగేరి శారద పీఠం ఉత్తరాధికారిని కలిసిన టీటీడీ ఈవో



**తిరుపతి, నవంబర్ 15, (ఆంధ్ర పత్రిక) :** శృంగేరి శారద పీఠం ఉత్తరాధికారి శ్రీ విదు శేఖర భారతి తీర్థ స్వామీజీని టీటీడీ ఈవో శ్యామల రావు మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతిలోని శృంగేరి శంకర పీఠానికి ఈవో దంపతులు శుక్రవారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఈవో దంపతులకు స్వామీజీ సత్కరించి ఆశీర్వచనం అందించారు. అనంతరం సనాతన ధర్మవ్యాప్తిని, వేద పరిరక్షణ , వేద విద్యావ్యాప్తికి టిటిడి చేపడుతున్న కార్యక్రమాలను ఈవో స్వామీజీకి వివరించారు.

# బ్రహ్మంగారిమఠం గురుకుల పాఠశాల పట్ల నిర్లక్ష్యం : ఎస్ఎఫ్ఐ

## ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్



**బ్రహ్మంగారిమఠం, నవంబర్ 15, (ఆంధ్ర పత్రిక) :** బ్రహ్మంగారిమఠం తోటపల్లి గ్రామం సమీపంలో ఉన్న బాలుర గురుకుల పాఠశాలను భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో పర్యటించడం జరిగింది, అనంతరం జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్,జిల్లా సహాయ కార్యదర్శి ఎర్రంపల్లి అజయ్ లు మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠంలోని తోట్లపల్లి గ్రామం సమీపంలో ఉన్న అంబేద్కర్ గురుకుల పాఠశాల (బాలురు) ను దాదాపు 21 కోట్ల పైనేబడ్జెట్తో పాఠశాలలో నిర్మించడం జరిగింది. 26-12-2023 తేదీన గత ప్రభుత్వంలో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యే, ఆధ్వర్యంలో పాఠశాలను ప్రారంభించడం జరిగింది. ఆ పాఠశాలలో విద్యార్థులకుఅవసరమయ్యే మౌలిక వసతులుకల్పించి నప్పటికీ, ఇంతవరకు అడ్మిషన్లు, టీచర్ల నియమించకపోవడం చాలా దారుణం, గురుకుల పాఠశాల పట్ల ఉన్నత అధికారులు. ఇంత నిర్లక్ష్యంగావ్యవహరించడంఎస్ఎఫ్ఐ,గాఖండిస్తున్నాం,పాఠశాలలో విద్యార్థులు లేకచెట్లతో, దుమ్ము, దులితో నిండిపోయి ఉంది,కాబట్టిపాఠశాల పై విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలుతీసుకోవాలని, అదేవిధంగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉన్నత విద్య ఉచిత విద్యఅందిస్తామని హామీలు ఇచ్చారు, కాబట్టి బ్రహ్మంగారిమఠంలో ఉన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించడం ఈ ప్రభుత్వం బాధ్యత కావున,ఈ ప్రాంతం ఎమ్మెల్యే చొరవ చూపించి, గురుకుల పాఠశాలను అభివృద్ధి పరిచే విధంగా అధికార పూర్వకంగా అవసరమయ్యే చర్యలను తీసుకోవాలని,భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) గా డిమాండ్ చేస్తున్నాం, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలోఉద్యమాలకుచేయడానికి సంసిద్ధంగాఉంటామని తెలియజేస్తున్నాం, ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్ పాల్గొన్నారు.



# అమరవీరుల ఉత్సవాలు







**కారంపూడి,నవంబర్ 15 (ఆంధ్రప్రత్రిక):**నాలుగు శతాబ్దాల క్రితం ఆనాడు కార్యము పొడిగా పిలవబడిన నేటి పల్నాడు జిల్లా కారంపూడిలో ఈ నెల 30వ తారీఖు నుండి ఆరంభం అవబోవుతున్న వీరుల ఉత్సవాల్లో, మరలా దర్శనం ఇవ్వబోతున్న అలనాటి వీరుల ఆయుధాలు దశాబ్దాలు, శతాబ్దాలు గడుస్తున్న మరుగు పడని అలనాటి కురుక్షేత్ర యుద్ధంలాంటి యుద్ధమే, ఈ అమరవీరుల ఉత్సవాలు మహాభారత కథలో ఎటువంటి పర్వాలు ఉన్నాయో ,ఈ పల్నాటి వీరుల కథలోనూ అలాంటి పర్వాలనే చూడవచ్చును. ఉత్తర గోగ్రహణంలో ఆవుల మందలను ఉత్తర కుమారుడి నీ అడ్డుపెట్టుకొని అర్జునుడు ఏ విధంగా అవలమందలను వెనుకకు తీసుకువచ్చినాడో, అలాగే మందపోరులో మహాబలవంతుడైన లంకన్నను చూస్తాము. అలాగే మహాభారతంలో రాయబారం లాంటి సన్నివేశంలో శ్రీకృష్ణ భగవానుడు రాయబారం చేస్తాడు,ఇక్కడ ఈ పల్నాటి యుద్ధం లో అలాంటి రాయబారమే నలగామ రాజు రాయబారం చేస్తాడు. కానీ మహాభారత యుద్ధంలో రాయబారం చేసిన శ్రీకృష్ణ భగవానుడు కౌరవులు చేసిన కుట్రలను తిప్పి కొట్టి విజెయుడుగా వస్తాడు. కానీ ఈ పల్నాటి రాయబారంలో నలగామ రాజు హత్యకు గురి అవుతాడు. రాయభార ము.రాజీమార్గాలు ఫలించక కారంపూడి నాగులేటి ఒడ్డున పల్నాటి యుద్ధం జరిగినది. అప్పటి పవిత్ర నాగులేరు అమర వీరుల రక్తంతో ఎరుపు రంగులో పారినట్లుగా చరిత్రకారులు చరిత్రపుటల్లోకి లిఖించి ఉన్నారు.ఒకప్పటి జీవనది నాగు లేరు ఇప్పుడు నదిలో నీరు ఉండక కృష్ణానది నీరు కోసం ఎదురుచూపులు చూస్తుంది చెట్లతో, జమ్ముతో,గడ్డితో నానా వ్యర్థాలతో దుర్గంధం ఎదజల్లుతూ నన్ను శుద్ధి చేయండి నన్ను శుభ్రపరచండి అని నేటి పరిపాలకులను దీనముగా అడుగుతున్నట్లుగా కనిపిస్తుంది ప్రస్తుత నాగులేరు. పూర్వ కాలం నుండి మొన్నటి వరకు నల్లమల అడవుల్లోనూ కొండల్లో నూ పడిన వర్షాపు నీరు నాగులేటిలో ప్రవహిస్తూ, ఎప్పటికప్పుడు తనని తాను శుద్ధి చేసుకునేది.కాలక్రమేనా నాగులేరు జన్మస్థలమైన నల్లమ ల అడవుల నుండి వచ్చే వాగులకు కాలువలకు నీరు నిల్వ చేయు టకు చెక్ డ్యాములు కట్టడం వలన, పై నుండి వర్షపు నీరు రాక పూర్తిగా మలినమైపోయి, నన్ను శుద్ధి చేయండి మహాప్రభూ అని ఇక్కడి నాయకులను అధికారులను, వేడుకుంటున్నట్లుగా నాగులేరు దీనవస్థలో మనకు కనిపిస్తుంది. ఆనాడు ప్రత్యేకంగా నాగు లేరు ప్రాంత రైతుల తాగునీరు,సాగు నీటి అవసరాల నిమిత్తం, మరియు నాగార్జునసాగర్ కుడి కాలువలో ఎప్పుడైనా ఏదైనా వరద నీరు వర్షపు నీరు, వచ్చి కాలువ కట్టలు దెబ్బ తినకుండా ఉండేందుకు గాను, కారంపూడి లాకుల వద్ద ఆ వర్షపు, వరద నీటిని ప్రక్కకు పంపే విధంగా సైడ్ గా ఒక కెనాల్ ను తవ్వి దానికి లాకులను ఏర్పాటు చేయడం జరిగినది. నల్లమల అడవుల నుండి నీటి ప్రవాహం రానప్పుడు ఈ కాలువ ద్వారా వెళ్లే నీటితో నాగులేరు శుద్ధి జరుగుతుండేది. కానీ 1990 నుండి 2010 వరకు ఈ రెండు దశాబ్దాల కాలంలో నాగులేరులోకి నీరు వచ్చుచున్న చిన్న లాకులు దెబ్బతినుట వలన, అక్కడ నీరు నిల్వ ఉండకపోవుట వలన అప్పటి ఎన్ఎస్పి కెనాల్స్ అధికారులు నాగులేరుకు రాకుండా అడ్డుకట్ట వేసి మొత్తం పూడ్చి వేసినారు అప్పటినుండి నాగులేరు ప్రాంత రైతులు సాగునీటికి, తాగునీటికి నానా అవస్థలు పడుతున్నారు. ఎంతమంది అధికారులకు, నాయకులకు నాగులేరు ప్రాంత రైతులు విన్నపాలు చేసుకొనను ప్రయోజనం లేకుండా పోయినది. ఇప్పటికైనాఅధికారులు,నాయకులు పునర్ ఆలోచించి అడ్డుకట్టను తీసిన ఎడల నాగులేరు ప్రాంత రైతులకు సాగునీరు, తాగునీరు అందించిన వారవుతారు. మరి ముఖ్యంగా ప్రస్తుత అపవిత్ర నాగులే రు మరలా తన పవిత్రతను సంతరించుకొని, జీవనది వలె ప్రవహిస్తుందని కారంపూడి మండలం ప్రజల కోరిక.

## నూతనంగా రెండు ఇసుక రేవులు

### - జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



**బాపట్ల ప్రతినిధి,నవంబర్ 15 (ఆంధ్రప్రత్రిక):** ఉచిత ఇసుక విధానంలో భాగంగా బాపట్ల జిల్లాలో కొత్తగా రెండు ఇసుక రేవులను గుర్తించామని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ఉచిత ఇసుక విధానంపై మైన్స్ శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్ కుమార్ మీనా రాష్ట్ర రాజధాని నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో శుక్రవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ వెంకట మురళి హాజరయ్యారు. నదులకు ఆనుకుని ఉన్న గ్రామాలలోని ప్రజల అవసరాలకు ఉచితంగా ఇసుక తీసుకువెళ్లడానికి మండల స్థాయి అధికారి అనుమతులు ఇవ్వాలని ముఖేష్ కుమార్ మీనా చెప్పారు. ఇసుక కావాల్సినవారు సంబంధిత గ్రామ సచివాలయంలో ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ పక్కాగా ఉండాలని, నిబంధనలు ఉల్లంఘనకు గురికాకుండా పర్యవేక్షణ పెరగాలన్నారు. డిసెంబర్ 19వ తేదీన మరుగుదొడ్ల దినోత్సవం నేపథ్యంలో ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్డి తప్పనిసరిగా నిర్మించుకునేలా ప్రజలను చైతన్య పరచాలన్నారు. ఈనెల 19 నుంచి డిసెంబర్ 19వ తేదీ వరకు నెల రోజులపాటు మరుగుదొడ్లు, పరిశుభ్రతపై ప్రజలలో విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు. కొత్త మరుగుదొడ్లు మంజూరు చేయాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచుకుని వారిని గ్రామ పంచాయతీ స్థాయిలో గుర్తించి బహుమతులు ప్రకటించాలన్నారు.బాపట్ల జిల్లాలో ఇసుక లభ్యత ఉన్న రెండు ప్రాంతాలను గుర్తించామని జిల్లా కలెక్టర్ వెంకట మురళి రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీకి వివారించారు. పర్యావరణ అనుమతుల కొరకు ప్రభుత్వానికి నివేదించామన్నారు. అనుమతులు రాగానే ఆ రేవులలో ఇసుక తవ్వకా లు ప్రారంభిస్తామన్నారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలోని జువ్వలపాలెం, గాజుర్లంక ప్రాంతా లలోని ఇసుక రేవుల వద్ద నీటి ప్రవాహం ఉందన్నారు. జువ్వలపాలెం వద్ద ర్యాంపు నిర్మాణం జరుగు తుందన్నారు. గాజర్లంక వద్ద నీటి ప్రవాహం ఉన్నందున ఇసుక తవ్వకాలు నేటికీ ప్రారంభం కాలేద న్నారు. వీక్షణ సమావేశంలో జిల్లా నుంచి జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, మైన్స్ ఏడి రాజేష్, డిపిఓ ప్రభాకర్, ఆర్ డబ్ల్యు ఎస్ ఎస్ఈ అనంతరాజు, తదితరులు పాల్గొన్నారు.

## కారంపూడి వీరుల ఉత్సవాలు ప్రారంభం



**కారంపూడి, నవంబర్ 15 (ఆంధ్రప్రత్రిక):**కారంపూడి వీరుల ఉత్సవాలు కార్తీకమాసం అమావాస్య రోజున మొదలవుతాయి దీనికి ముందుగా కార్తీక పౌర్ణమి రోజున వీరులగుడి ముఖాద్వారం వద్ద ఎరుపు రంగు జండా ఎగురవేస్తారు. దీనినే పడిగం కట్టటం అని వీర ఆచారవంతులు పిలుసుకుంటారు అసలు దీని పూర్వ చరిత్ర పల్నాటి యుద్ధ సమయంలో రాజీలు, రాయభారాలు అన్ని విఫలం అవ్వటంతో యుద్ధం అనివార్యం అవుతుంది. అప్పటి మహామంత్రి బ్రహ్మనాయుడు యుద్ధానికి కార్తీక అమావాస్య రోజున యుద్ధానికి సిద్ధం అవ్వాలని ముహూర్తం పెట్టి, కార్తీక పౌర్ణమి రోజున మేము యుద్ధానికి సిద్ధమని, వారి కోటపై జెండా ఎగరవేస్తారు ఆనాడు బ్రహ్మనాయుడు గారు చేసిన ఆ కార్యక్రమమే ఈ రోజున పల్నాటి వీరులగుడి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ పిడుగు తరుణ్ చెన్నకేశవ అయ్యగారు నిర్వహించిన ఈ పడిగం కట్టుట, ఈ కార్యక్రమంలో వీరుల ఆరాధన ఉత్సవానికి వీరాచారవంతులు సిద్ధమయ్యి తమ తమ పూర్వీకుల ఆయుధాలతో కార్తీక మాస అమావాస్య రోజున ప్రారంభమవు వీరాచారావంతుల ఉత్సవాలకు ఆహ్వానం పలకటం జరుగుతుంది.

## శివాలయానికి పోటెత్తిన భక్తులు



**నాదెండ్ల, నవంబర్ 15 (ఆంధ్రప్రత్రిక):**మండలంలోని పలు గ్రామాల్లో గురు పౌర్ణమి పురస్కరించుకొని దేవాలయాల్లో మహిళలు తెల్లవారు జాము నుండి పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు చేశారు. ఆలయ పూజారులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రిపూట కార్తీకదీపం ఆరాధన నిర్వహించనున్నారు. సాతులూరు గంగా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో గ్రామానికి చెందిన ప్రసన్నాంజనేయ స్వామి భక్త భజన బృందం వారు శుక్రవారం ఉదయం 7 గంటల నుండి శనివారం ఉదయం 7:00 వరకు 24 గంటల పాటు ఏకో హెూమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రతి దేవాలయం వద్ద రాత్రిపూట పలు భక్తివంతమైన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పూజలో పాల్గొన్న మహిళలకు ఆలయ పూజారులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దేవాలయాలను రంగురంగు విద్యుత్ పలతో అలంకరించారు.

## ఘనంగా ప్రారంభమైన వివిఐటి బాలోత్సవ్-2024



**మంగళగిరి, నవంబర్ 15 (ఆంధ్రప్రత్రిక):**ప్రపంచ తెలుగు బాలల పండుగ వివిఐటి బాలోత్సవ్ 2024 వేడుకలు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి ప్రాంగణంలో ఘనంగా ప్రారంభించారు. పదమూడు వేలకు పైగా పోటీదారులతో ప్రారంభమైన బాలోత్సవ్ 20 అంశాలు 61 విభాగాలలో మూడు రోజులపాటు 30 వేదికలపై వేడుకగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలను అవనిగడ్డ శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై వేడుకలను ప్రారంభించారు. వివిఐటి ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, మండలి బుద్ధప్రసాద్ గంట మ్రోగించి పోటీలను మొదలుపెట్టారు. ఈసందర్భంగా మండలి బుద్దప్రసాద్ మాట్లాడుతూ చిన్నారులలో సృజనాత్మకత నైపుణ్యాలను వెలికితీసే ప్రయత్నం వివిఐటి బాలోత్సవం అని కొనియాడారు. చిన్నతనంలోనే విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించటం ద్వారా భవిష్యత్తులో ప్రతిభావంతులుగా రూపొందుతారని అన్నారు. వివిఐటి భాలోత్సవ్లో పాల్గొన్న విద్యార్థులు ఏస్థాయికి ఎదిగిన బాలోత్సవ్ తోడ్పడుతుందన్న బావన కలుగుతుందని అన్నారు. బాలోత్సవ్లో పాల్గొనే విద్యార్థులు తెలుగుజాతి కీర్తిమకుటాలలో ఒకరు అవుతురాన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసారు. చిన్నారులకు కళలపట్ల సరియైన ప్రోత్సకం అందించి ముందుకు తీసుకుపోవటం ద్వారా తెలుగుజాతికి మహెూన్నతం లభిస్తున్నదని అన్నారు. కేవలం కళల ద్వారానే దేశానికి గౌరవము లభిస్తుందన్న విషయం మనందరము గుర్తుంచుకోవాలని అన్నారు. తెలుగుజాతికి ప్రత్యేక కళాసాంప్రదాయం ఉన్నాయని వాటిని మనం ప్రోత్సహించాలని అన్నారు. భాషను గౌరవించుకోవాలని, నేర్చుకోవాలని, మాట్లాడాలని చిన్నా రులకు సూచించారు. పాశ్చాత్యుల చేత కొనియాడిన భాష అని తెలుగువారుగా మనం పుట్టం మన అదృష్టం అని అన్నారు. వివిఐటి చైర్మన్ వాస్ రెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ చిన్నారులు ఆనందంగా ఉంటే అందరం ఆనందంగా ఉంటారని మూడు రోజులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొని మధురానుభూతులు పొందాలని అన్నారు.

## స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ కార్యాలయంలో కార్తీక దీపోత్సవం



**విజయవాడ,నవంబరు 15(ఆంధ్రప్రత్రిక):**ఆధ్యాత్మిక విశ్వ గురువు,సైంటిఫిక్ సెయింట్ శ్రీశ్రీశ్రీ గురు విశ్వ స్ఫూర్తి గురుదేవుల దివ్య ఆశీస్సులతో మధురానగర్లో ఉన్న స్ఫూర్తి కుటుంబం ట్రస్ట్ ఆఫీస్లో కార్తీక పూర్ణిమ సందర్భంగా ఉదయం శ్రీవిశ్వమాతకు పీఠ పూజ,గురు పాద పూజ మరియు సాయంత్రం దీపోత్సవం జరిపారు. కార్తీకదీపంలోని శివాగ్ని సాక్షిగా, మనిషి, తనలోని చీకటి ఆలోచనలను, అలవాట్లను తొలగించుకొని, మానవజాతికి మేలు చేసే మంచిని, మానవత్వాన్ని,మనిషి, తనలో నిలుపుకోవటం, కార్తీక దీపోత్సవ సార్థక, సాఫల్యత అని విశ్వ స్ఫూర్తి తెలియచేసారు. అని ట్రస్టీ శ్రీ షణ్ముఖరావు చెప్పారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో స్ఫూర్తి కుటుంబసభ్యులు పాల్గొని గురుదేవుల కృపకు పాత్రు కాగలిగారు.

## మోకాళ్లపై నిరసన



**తాడేపల్లి, నవంబర్ 15 (ఆంధ్రప్రత్రిక):**తమకు చట్టపరంగా, న్యాయపరంగా రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు శుక్రవారం మోకాళ్లపై నిలబడి దీక్ష శిబిరంలో తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ యాజమాన్యం మొండివైఖరి విడనాడాలని ఇతవుపలికారు. కోర్టు తీర్పులను సైతం ధిక్కరిస్తారని ప్రశ్నించారు. న్యాయస్థానాలపై గౌరవం ఉంచైనా కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ ట్రిబ్యునల్ కోర్ట్, హైకోర్టు ఇచ్చిన తీర్పు ను అమలు గారి జరపవలసిన అవసరం ఉందని చెప్పారు. న్యాయం అడిగినకార్మికులపై బైండోవర్ కేసులు పెడతారఅని ప్రశ్నించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని 370 కుటుంబాలతో ముడిపడి ఉన్న ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించి తమ చిత్త శుద్ధి నిరూపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కే.ఆదినారాయణ, సూరి, సాంబయ్య, యెహెూషువ, ఆశీర్వాదం, బి.నవనీతం, శారద, నారమ్మ, రమాదేవి, టి.నాగేశ్వరరావు, గురవయ్య, ఇమాంబి, సాంబశివరావు, ఎస్ కే.జానీ, ఆశిష్ తదితరులు పాల్గొన్నారు.

## దిక్కుతోచని స్థితిలో అన్నదాత

### - రైతులను నిలువునా ముంచుతున్న కాలువ గండ్లు, - ప్రభుత్వ వైఫల్యమా?
### - అధికారుల తప్పిదమా?



**బెల్లంకొండ, నవంబర్ 15(ఆంధ్రప్రత్రిక):**పెదకూరపాడు నియోజకవర్గం బెల్లంకొండ మండల వ్యాప్తంగా, సాగుకు పుష్కలంగా సాగునీటిని అందిస్తున్నారు. అయితే ఈ నీటిని సరఫరా చేసేందుకు,. నిర్మించినటువంటి కాలువలను పూర్తిస్థాయిలో శాశ్వత ప్రతిపాదిక న నిర్మించకపోవడంతో, ప్రతి వర్షాకా లంలో నీరు విడుదల చేసిన ప్రతిసారి ఇబ్బందులు తలెత్తుతు న్నాయి. కాలువలకు శాశ్వత ప్రతిపాదికన నిర్మాణం చేపట్టక పోవడం, కేవలం మట్టి కట్టలతో నిర్మాణం. చేపట్టడంతో సమస్య లు తలెత్తుతున్నాయి. నీటి ప్రవాహం అధికమై, ఉదృతంగా పారుతుండడంతో కాలువ కట్టలు తెగిపోవడం ప్రతి వర్షాకాలంలో ఎదురయ్యే ప్రధాన సమస్య దీంతో కాలువ దిగువ న పొలాలు ప్రతిసారి చేతికొచ్చిన పంట నీటి మునిగి రైతులు నష్టపోతున్నారు. ప్రతి ఏడాది రైతులకు తిప్పలు తప్పడం లేదు. ఇలాంటి పరిస్థితులు తలెత్తుతున్న అధికారులు. నామ మాత్రం పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారు. మరల వర్షాలు పడగానే నాణ్యత లేని ఈ పనులు మరల కాలువలకు గండ్లు పడటం రైతుల పాలిట శాపాలుగా మారి కాలువ కట్టలు ఎక్కడిక్కడే తెగిపోయి రైతుల పొలాలను నట్టేట నిలువునా ముంచుతున్నాయి. తన 8 ఎకరాలు వరి పంట కాలువ గండీపడటంతో నీట మునిగిందని ,2లక్షల 40 వేల వరకు పెట్టుబడులు పెట్టామని తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు వెన్నా శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యమైన పనులు చేపట్టి కాలువకు అవసరం ఉన్న చోట మరమ్మత్తులు చేపట్టాలని రైతులు తెలియజేశారు. **వివరణ:** అసిస్టెంట్ ఇంజనీరింగ్ని (ఏఇ) వివర ణ కోరగా మాపై అధికారుల నుంచి కాలువ మరమ్మత్తులు నిమి త్తం ఎలాంటి ఆదేశాలు రాలేదని ఇక కాలువలలో ఉన్న నీటికి తోడు ఇటీవల గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వరద నీరు తోడవడంతో అక్కడక్కడ కాలువ కట్టలపై నుంచి నీరు పొంగి పారడంతో మట్టి కట్టలు దెబ్బతింటున్నాయని వారు తెలియజేసినారు.

## రాజుపాలెంలో గ్రామసభ



**రాజుపాలెం, నవంబర్ 15 (ఆంధ్రప్రత్రిక):** మండల కేంద్రమైన రాజుపాలెం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభలు అధికారులు శుక్రవారం నిర్వహించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన గ్రామ సర్పంచ్ పులి బండ్ల అశోక్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులు అర్హులైన ప్రజలు సద్వినియోగించుకోవాలని కోరారు.ఈ సభలో చౌటపాపాయపాలెం, రాజుపాలెం గ్రామాలకు 2025- 2026 ఆర్థిక సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకం పనులను అధికారులు గుర్తించి ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచులు సకినాల వలిరాజు, వాసా పెద వెంకటశ్వర్లు, టీడీపీ నాయకులు పగడాల శ్రీనివాసరావు, కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సహకరించారు.. అండగా నిలిచారు

### చిల్లపల్లి శ్రీనివాసరావుకు విజయ్ శేఖర్ అభినందన
### చిల్లపల్లి యూత్ ఆధ్వర్యంలో సత్కారం



**మంగళగిరి, నవంబర్ 15 (ఆంధ్రప్రత్రిక):**మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్గా నియమితులైన బేతపూడి విజయ శేఖర్ శుక్రవారం మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జనసేన పార్టీ ఇంచార్జీ చల్లపల్లి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి కేటాయింపుకు సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. తొలి నుంచి చిల్లపల్లి శ్రీనివాసరావు తనకు అండగా ఉంటూ వస్తున్నారని అన్నారు. నామినేటెడ్ పదవికి ఎంపిక చేసినందుకు జనసేన పార్టీ అధ్యక్షుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. చిల్లపల్లి యూత్ ఆధ్వర్యంలో బేతపూడి విజయ శేఖర్ను ఘనంగా సత్కరించారు.

## రాష్ట్ర స్థాయిలో మెరిసిన అరవింద క్రీడా కెరటం



**తాడేపల్లి, నవంబర్ 15 (ఆంధ్రప్రత్రిక):** ఇటీవల గుంటూరు జిల్లా, ఆత్మకూరు, మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, స్కేటింగ్ ప్రాంగణంలో జరిగిన 36వ ఇంటర్ డిస్టిక్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ లో ఆర్టిస్టిక్ కేటగిరీలో అండర్ -14 విభాగములో అరవింద విద్యార్థి హాసీష్ ఇన్ లైన్ ఫ్రీస్టయిల్ విభాగములో రజత పతకము, సోలో డాన్స్ విభాగ ములో కాంస్య పతకాన్ని గెలుపొంది తన ప్రతిభను చాటాడు. దీని ద్వారా తరువాత తమిళనాడు రాష్ట్రం, పొలాచ్చిలో జరిగే 62 వ జాతీయ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్షిప్కు అర్హత సాధించాడు. ఎంతో మంది పాల్గొన్న ఈ పోటీలలో గుంటూరు జిల్లా నుంచి అర్హత సాధించినది అరవింద విద్యార్థి ఒక్కడే కావడం విశేషం. హాసిష్కు అరవింద యాజ మాన్యం బి.ఇంద్రాణి, సాయి అరవింద్, రజియా, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు అభినందనలు తెలియచేసి, చిరు సత్కారం చేసారు.

## మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారడానికి ఎంతో సమయం పట్టదు

### -ఎక్సైజ్ శాఖ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు




**పెదకూరపాడు, నవంబర్ 15 (ఆంధ్రప్రత్రిక):**డ్రగ్స్ ఒకసారి వినియోగించిన తర్వాత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారడానికి ఎంతో సమయం పట్టదని పెదకూరపాడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఇన్స్పెక్టర్ వొద్దెబోయిన శ్రీనివాసులు అన్నారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు,క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర గుంటూరు సౌజన్యముతో జనచైతన్య సమితి అద్వర్యంలో పెదకూరపాడులోని శ్రీ కాకతీయ డిగ్రీ కళాశాలలో డ్రగ్ ప్రివెన్షన్ పై కెపాసిటీ బిల్డింగ్ వర్క్ షాఫ్ ను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా హాజరైన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల గొప్పవాళ్ళు అవుతామని భ్రమపడకూడదని దుష్పరిణామాలు కలుగుతాయని అన్నారు. డ్రగ్స్ వినియోగంలో తోటివారు మిమ్మల్ని బలవంతం చేస్తే మీకే ఆవిచక్షణ ఉండాలని, తమను తాము రక్షించుకోవాలని అన్నారు.ఈకార్యక్రమంలో గుంటూరు జిల్లా నెహ్రూ యువ కేంద్ర జిల్లా యువ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి మాట్లాడుతూ నెహ్రూ యువ కేంద్ర అనేక అవగాహన కార్యక్రమాలు యువతకోసం నిర్వహిస్తున్నదని అందులో భాగంగా ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని,యువత దైనందిన జీవితంలో మంచి అలవాట్లు పాటించి డ్రగ్స్ లాంటి ముత్తు పదార్థాలకు దూరం ఉండాలని అన్నారు.శ్రీ కాకతీయ కళాశాల ప్రిన్సిపాల్ ఈ.అశోక్ బాబు మాట్లాడుతూ డ్రగ్స్ సంబందిచిన చట్టాలు చాలా కఠినమైనవని విద్యార్థులు జీవితాలను నాశనం చేసుకోవద్దని డ్రగ్స్ కి దూరంగ ఉండాలని అన్నారు. ఈకార్యక్రమంలో జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబు, పేస్ సొసైటీ సెక్రటరీ రమేష్, జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు, కాకతీయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం డ్రగ్స్కు దూరంగా ఉండాలని,సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలని అందరూ ప్రతిజ్ఞ చేశారు.

## ప్రశాంతంగా కార్తీక పౌర్ణమి సముద్రం స్నానాలు



**బాపట్ల ప్రతినిధి,నవంబర్ 15 (ఆంధ్రప్రత్రిక):** కార్తీక పౌర్ణమికి సూర్యలంక బీచ్లో సముద్ర స్నానాలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. వాతావరణం అనుకూలించకపోవడంతోఈ ఏడు పర్యాటకుల సంఖ్య కొంత మేర తగ్గినట్లు చెబుతున్నారు. అయినప్పటికీ అధికారులు పర్యాటకుల కు అవసరమైన ఏర్పాట్లు భద్రతా చర్యలపై అత్యంత జాగ్రత్తలు తీసుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామునే సూర్యలంక సముద్రతీరంలో సాగర హారతి కార్యక్రమంలో బాపట్ల శాసనసభ్యులు వేగేశ న నరేంద్ర వర్మ సతీ సమేతంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సాగర హారతి కార్యక్రమంలో మాచర్ల నియోజకవర్గ శాసనసభ్యులు జూలగంటి బ్రహ్మానంద రెడ్డి, జనసేన సమన్వయకర్త నామన వెంకట శివ నారాయణ, యార్లగడ్డ లక్ష్మీనారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

**పర్యాటకులకు అల్పాహారం:**

వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అల్పాహార శిబిరం వద్ద పర్యాటకులకు ఎమ్మెల్యే నరేంద్ర వర్మ అల్పాహారం అందజేశారు. అదేవిధంగా జనసేన నాయకులు నామన వెంకట శివన్నారాయణ ఆధ్వర్యంలో సముద్ర స్నానానికి విచ్చేసిన పర్యాటకులకు అయ్యప్ప, శివ స్వాములకు ప్రత్యేకంగా తయారు చేసిన అల్పాహారాన్ని అందజేశారు. వైసిపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అల్పాహార కేంద్రాన్ని మాజీ శాసనసభ్యులు కోన రఘుపతి ప్రారంభించారు.

# డిసెంబర్ 21న జీఎస్టీ కౌన్సిల్ సమావేశం..

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాల ఆర్థిక మంత్రులు హాజరుకానున్నారు. ఆయా రాష్ట్రాల నుంచి వచ్చే సిఫార్సులను ఆర్థిక మంత్రిశాఖ స్వీకరించ నుంది. ఈ సమావేశానికి తెలుగు రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సహా ఆయా రాష్ట్రాల ఆర్థిక మంత్రులు హాజరుకానున్నారు. ఇక కేంద్ర బడ్జెట్ ఫిబ్రవరి 1, 2025న ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నారు. గత బడ్జెట్‌లో ఏపీకి భారీ ఆర్థిక సాయాన్ని కేంద్రం ప్రకటించింది. ఈసారి కూడా ఏదొక సాయం చేయొచ్చని తెలుస్తోంది. ప్రస్తుతం ఎన్డీఏ కూటమిలో తెలుగు దేశం పార్టీ కీలక రోల్ పోషిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర బడ్జెట్‌లో మరొకసారి ఆంధ్రప్రదేశ్‌కు ప్రాధాన్యత దక్కొచ్చని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. డిసెంబర్ 21న జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్‌తో పాటు పలు కీలక సమస్యలను పరిష్కరించే అవకాశం ఉంది. ఆరోగ్యం, బీమాపై జీఎస్టీ మినహాయింపుపై నిర్ణయం తీసుకునే ఛాన్సుంది. అలాగే సాధార వస్తువులపై కూడా పన్ను రేట్ల హేతుబద్ధీకరణను పరిగణించవచ్చని తెలుస్తోంది. రాష్ట్ర మంత్రుల ప్యానెల్ నుంచి వచ్చే సిఫార్సుల ఆధారంగా రేట్లను 12 శాతం నుంచి 5 శాతం వరకు తగ్గించవచ్చని సమాచారం.గత బడ్జెట్‌లో బీహార్, ఏపీకే కేంద్రం ప్రాధాన్యత ఇచ్చిందంటూ ప్రతిపక్ష కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు చేసింది. మిత్రులను మచ్చిక చేసుకునేందుకు మిగతా రాష్ట్రాలను పట్టించుకోలేదని పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. 2025లో ప్రకటించబోయే బడ్జెట్‌లోనైనా ఏవైనా మెరుపులు ఉంటాయేమో చూడాలి.

# నేటి నుంచి టెండర్లకు ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం మూడు టెండర్లు పిలిచింది. శనివారం నుండి టెండర్లు దాఖలుచేసుకునే అవకాశం కల్పించారు. 30వ తేదీతో ఈప్రక్రియ ముగించనున్నారు. ప్రస్తుతం రాజధాని పరిధిలోని తుళ్లూరు మండల గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. అనం తవరం, నెక్కల్లు, శాఖమూరు, ఐనవోలు వంటి గ్రామాల్లో నీటి సమస్య మరీ తీవ్రంగా ఉంది. తాజా టెండర్ల ప్రతిపాదన ప్రకారం హరి శ్చంద్రాపురం వద్ద కృష్ణానదిలో చిన్నబావి నిర్మిం చి అక్కడ నుండి ఇన్‌టేక్ వెల్ ద్వారా ప్లాంటులోకి తీసుకుని శుభ్రం చేసి, గ్రామాలకు సరఫరా చేసే విధంగా ప్లాను రూపొందించారు. దీనిలో బోరు పాలెం, దొండపాడు, పిచ్చుకలపాలెం, అనంతవరం, ఐన వోలు, రాయపూడి, కొండమరాజుపాలెం గ్రామాల్లో నీటిసరఫరాకు రూ.5.02 కోట్లను కేటాయించారు. మందడం, వెలగపూడి, మల్కాపురం, నేలపాడు, నెక్కల్లు, తుళ్లూరు, శాఖమూరు గ్రామాలకు నీటి సరఫరా అవసరమైన పైపులైన్ల ఏర్పాటు సదుపాయాలకు రూ.5.73 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసి, దానికి అనుగుణంగా టెండరు పిలిచారు. పెనుమాక, కృష్ణాయపాలెం, బేతపూడి, నిడమర్రు, కురగల్లు, నవులూరు, ఎర్రబాలెం, నీరుకొండ గ్రామాల నీటి సరఫరాకు రూ.3.41 కోట్లు అంచనాతో పైపులైన్లు వేయాలని నిర్ణయించారు. ఈ పనులు సజావుగా పూర్తయితే రాజధాని పరిధిలో అత్యంత కీలకమైన తాగునీటి సమస్య కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. దీనికోసం 45 కిలోమీటర్ల మెయిన్‌లైను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అలాగే, 24 చోట్ల ట్యాపింగ్ పాయింట్లు పెట్లేలా నీటి సరఫరా ప్రణాళిక రూపొందించారు. దీనికోసం 56 కిలోమీటర్లమేర డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్కు(పైపులైన్లు) వేయాల్సి ఉంటుందని నిర్ణయించారు. తంలో రూపొందించిన ప్లానులో వైకుంతపురం రిజర్వాయర్‌లో ఒక ఇన్‌టేక్‌వెల్, పెనుమాక రెవెన్యూ పరిధిలో కరకట్ట దిగువన మరొక ఇన్‌టేక్ వెల్ నిర్మించాలని ప్రతిపాదించారు. వాటి నుండి ట్యాపింగ్ పాయింట్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ప్రతిపాదించారు. 2030 నాటికి ప్రకాశం బ్యారేజీ నుండి 303 ఎంఎల్‌డి (4.94 టిఎంసి), వైకుంతపురం రిజర్వాయర్ నుండి 503 ఎంఎల్‌డి (6.48 టిఎంసి)ల నీరు అందు బాటులో ఉంటుందని అంచనా వేసి దానికి అనుగుణంగా ప్రణాళిక రూపొందించారు. అమరావతికి 2040 నాటికి 8.69 టిఎంసిలు, 2045 నాటికి 10.53 టిఎంసిలు, 2050 నాటికి 11.42 టిఎంసిల నీరు అవసరం ఉంటుందని గతంలో లెక్కగట్టారు.

# అయ్యప్ప భక్తులకు శుభవార్త

(మొదటి పేజీ తరువాయి)

క్షేత్రానికి వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసి నట్లు ఓ ప్రకటనలో తెలిపింది.తెలుగు రాష్ట్రాల్లోని వేర్వేరు ప్రాంతాలను కలుపుతూ 8 ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది. ఈ నెల 22, 29 తేదీల్లో మౌలాలి(హైదరాబాద్)-కొల్లాం, ఈనెల 24, డిసెంబర్ 1వ తేదీల్లో కొల్లాం- మౌలాలి, నవంబర్ 18, 25 తేదీల్లో మచిలీపట్నం-కొల్లాం, నవంబర్ 20, 27 తేదీల్లో కొల్లాం- మచిలీపట్నం ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే పేర్కొంది. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

# మహారాష్ట్ర ఎన్నికలు..

**అమరావతి,నవంబరు 15 (ఆంధ్రపత్రిక):** మహారాష్ట్ర ఎన్నికల ప్రచారం చివరి దశకు చేరింది. ప్రచార గడువు పద్దెనిమిదో తేదీన సాయంత్రం ముగియనుంది. సమయం ముగి యడంతో పెద్ద ఎత్తున సభలు, సమావేశాలు నిర్వహించడానికి బీజేపీ నేతలు ఏర్పాట్లు చేశారు. మరోమారు అక్కడ అధి కారం సాధించేందుకు బిజెపి తనముందున్న అన్ని అస్త్రాల ను వినియోగిస్తోంది. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ తరపున ఎన్డీఏ నేతలు రంగంలోకి దిగుతున్నారు. చంద్రబాబుతో పాటు పవన్ కల్యాణ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు మహారాష్ట్ర వెళ్తున్నారు. శని, ఆదివారాల్లో పవన్ కల్యాణ్ నాందేడ్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేయనున్నారు. మహారాష్ట్రలో తెలుగు వారు ఉన్న పలు ప్రాంతాల్లో పవన్ కల్యాణ్ ప్రచారం సాగనుంది. నాందెడ్‌లో తెలుగు మూలాలున్న ప్రజలు ఎక్కువగా ఉన్నారు. అందుకే వీరిని ఆకట్టుకునేందుకు పవన్ కల్యాణ్‌తో ప్రచారం చేయించాలని నిర్ణయించారు. పవన్ కల్యాణ్ నాందేడ్ ప్రాంతంలో మొత్తం మూడు బహిరంగసభల్లో పాల్గొంటారు. ఇతర ప్రాంతాల్లోనూ వారి పర్యటన ఉంటుంది. పవన్ కల్యాణ్‌తో పాటు మంత్రి సత్యకుమార్ కూడా ఈ ప్రచారంలో పాల్గొంటారు. నాందేడ్‌కు బీజేపీ తరపున ఎన్నికల ఇంచార్జ్‌గా ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. పవన్ కళ్యాణ్ ప్రచారం అంశాన్ని సోషల్ మీడియాలో ధృవీకరించారు. ఏపీ బీజేపీ ఉపా ధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి గత నెల రోజులుగా నాందేడ్‌లోనే బీజేపీ ఎన్నికల ప్రచారాన్ని సమన్వయం చేసుకుంటున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహా బీజేపీ ముఖ్య నేతలు అంతా ఇప్పటికే ఒక విడత నాందేడ్‌లో ప్రచారం పూర్తి చేశారు. పవన్ కల్యాణ్, సత్యకుమార్ నాందేడ్ ప్రాంతంలో మూడు సభల్లో పాల్గొంటారు. ఇతర ప్రాంతాల్లోనూ విస్తృతంగా ప్రచారం చేస్తారు. పవన్, సత్యకు మార్ ప్రచారం వల్ల బీజేపీ విజయావకాశాలు మరింత మెరుగుపడి అభ్యర్థుల మెజార్టీలు భారీగా పెరుగుతాయని ఎన్నికల ఇంచార్జ్ విష్ణువర్ధన్ రెడ్డి ధీమా వ్యక్తం చేస్తున్నారు. నాందేడ్ ప్రాంత అభివృద్ధి, అక్కడి ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని బీజేపీ కూటమి చేసిన కృషి ఇక్కడి ప్రజలు మరోసారి బీజేపీ కూటమిని ఆదరిస్తారని నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. నాందేడ్ ఎన్నికల ఇంచార్జిగా బీజేపీ నాయకత్వం బాధ్యతలు అప్పగించిన తర్వాత నెల రోజులుగా అక్కడ ప్రచారాన్ని సమన్వయం చేసుకుంటున్నానని బీజేపీ విజయం ఎలాంటి డౌట్ లేదని ఆయన అంటున్నారు.

# కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో చంద్రబాబు భేటీ

(మొదటి పేజీ తరువాయి)

చర్చించినట్టు సమాచారం. నిర్మలా సీతారామన్‌తో భేటీ ముగిసిన తర్వాత విదేశాంగశాఖ మంత్రి జైశంకర్‌తో సీఎం సమావేశమయ్యారు.

# రాజధాని అమరావతిలో భూ కేటాయింపులు..

(మొదటి పేజీ తరువాయి)

సంస్థలకు భూ కేటాయింపులపై మంత్రుల కమిటీ నిర్ణయం తీసుకోనుంది.మంత్రులు పయ్యావుల కేశవ్, నారా యణ, కొల్లు రవీంద్ర, కందుల దుర్గేశ్, టీజీ భరత్ సబ్ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. గతంలో రాజధాని ప్రాంతంలో భూ కేటాయింపులు చేసిన సంస్థల ప్రస్తుత పరిస్థితిపై పరిశీలన చేయనున్నారు. కొత్తగా వచ్చే సంస్థలకు చేయాల్సిన కేటాయింపులు, ప్రపంచ స్థాయి సంస్థలను అమరావతికి తీసుకురా వడంపై కమిటీ చర్చించనుంది. గతంలో 120కి పైగా సంస్థలకు చంద్రబాబు ప్రభుత్వం భూ కేటాయింపులు చేసింది. ప్రస్తుతం రాజధానిలో మళ్లీ భవనాల నిర్మాణాన్ని పునః ప్రారంభిస్తామని 115కు పైగా సంస్థలు ప్రభుత్వాన్ని సంప్రదించాయి.

# ఇస్రోకు మద్దతు ఏదీ?

(మొదటి పేజీ తరువాయి)

మధ్య కాలంలో మన దేశ జీడీపీకి అంతరిక్ష రంగం నుంచి 60 బిలియన్ డాలర్లు సమకూరింది. జాతీయ రోదసి దినోత్సవం సందర్భంగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ గురువారం విడుదల చేసిన నివేదిక ప్రకారం, రోదసి రంగంలో 400కుపైగా ప్రైవేట్ కంపెనీలు ఉన్నాయి. వీటి వల్ల 6.3 బిలియన్ డాలర్ల రెవెన్యూ వస్తుండగా, 47 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభిం చాయి. ప్రపంచంలో అతి పెద్ద రోదసి ఆర్థిక వ్యవస్థల్లో మన దేశం ఎనిమిదో స్థానంలో ఉంది. 2024నాటికి మన దేశ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థ విలువ సుమారు రూ.6,700 కోట్లు. ప్రపంచ అంత రిక్ష ఆర్థిక వ్యవస్థలో ఇది 2-3 శాతం కాగా, వచ్చే దశాబ్దానికి దీనిని 10 శాతానికి పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే నాసా బడ్జెట్ కన్నా ఇస్రో బడ్జెట్ 15 రెట్లు ఎక్కువ. ఇస్రోను స్థాపించి 55 ఏండ్లు అవుతున్నది. ఈ మొత్తం కాలంలో ఇస్రో పెట్టుబడులు నాసా ఒక ఏడాది బడ్జెట్ కన్నా తక్కువ. ఇస్రో ప్రస్తుత వార్షిక బడ్జెట్ సుమారు 1.6 బిలియన్ డాలర్లు కాగా, నాసా వార్షిక బడ్జెట్ 25 బిలియన్ డాలర్లు. ఇస్రో చైర్మన్ సోమనాథ్ ఇటీవల కర్ణాటక విద్యార్థులతో మాట్లాడుతూ, అంతరిక్ష రంగంలో భాగస్వాములైన దేశాలతో ఆధిపత్యం కోసం పోరాడటం కన్నా దేశానికి సేవ చేయడంపైన మాత్రమే ఇస్రో దృష్టి సారించిందన్నారు.

# ఆదివాసీల సంస్కృతిని కాపాడాలి

(మొదటి పేజీ తరువాయి)

దేశం మొత్తానికి పిలుపునిచ్చారని ప్రధాని గుర్తుచేసుకున్నారు. పీఎం జన్‌మన్ యోజన పథకం ద్వారా పనుల ప్రారంభ ఘనత ద్రౌపదీ ముర్మ్మదే అని కొనియాడారు. ఆదివాసీల కష్టాలను తీర్చేందుకు ఈ పథకం ద్వారా రూ.24వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రధాని నరేంద్రమోదీ వెల్లడించారు. బిహార్‌లో నిర్వహించిన సభలో ప్రధాని పాల్గొని ప్రసంగించారు. ఆదివాసీలు తమ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ధర్తీ అబా భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా బీహార్‌లోని జాముయ్‌లో ప్రధాని మోడీ ఆయనకు నివాళులర్పించి, ఆయన పేరిట పోస్టల్ స్టాంపును విడుదల చేశారు. 6000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులను కూడా ప్రారంభించారు. గిరిజన సమాజాన్ని నిర్లక్ష్యం చేయడానికి గత ప్రభుత్వాలే కారణమని ప్రధాని మోడీ అన్నారు. గత ప్రభుత్వాల వల్ల గిరిజన సమాజం నిర్లక్ష్యానికి గురైందన్నారు. గిరిజన సమాజం దేశాభివృద్ధి రేసులో వెనుకబడింది. దేశ స్వాతంత్ర్యానికి ఒక పార్టీ లేదా ఒక కుటుంబం సహకరించిందని చేసే ప్రచారం తప్పన్నారు. గిరిజన సమాజంలోని ఎందరో మహానాయకులు త్యాగాలు చేశారని ప్రధాని మోడీ అన్నారు. గిరిజన సమాజం చేసిన కృషికి చరిత్రలో సముచిత స్థానం దక్కలేదన్నారు.



ఏళ్ల తరబడి గిరిజన సంఘం నిర్లక్ష్యానికి గురైంది. గిరిజన సమాజం, సహకారం, త్యాగాన్ని తుడిచిపెట్టే ప్రయత్నం జరిగిందన్నారు. అత్యంత వెనుకబడిన గిరిజనులపై ఎలాంటి శ్రద్ధ తీసుకోలేదన్నారు. వారి జీవితాల్లోని కష్టాలను తగ్గించడానికి, మా ప్రభుత్వం 24 వేల కోట్ల రూపాయలతో ప్రధానమంత్రి జన్మన్ యోజనను ప్రారంభించింది. దేశంలోని అత్యంత వెనుకబడిన గిరిజనుల ఆవాసాల అభివృద్ధికి ఈ పథకం భరోసా ఇస్తోందని అన్నారు. అత్యంత వెనుకబడిన గిరిజనులకు మన ప్రభుత్వం వేల సంఖ్యలో శాశ్వత గృహాలను ఇచ్చిందని ప్రధాని అన్నారు. రాముడిని యువరాజును చేసింది గిరిజన సమాజమేనని ప్రధాని మోడీ అన్నారు. భారతదేశ సంస్కృతిని, స్వాతంత్ర్య పరిరక్షణ కోసం వందల ఏళ్లుగా పోరాటానికి నాయకత్వం వహించినది గిరిజన సమాజం. భారతదేశ సంస్కృతి, స్వాతంత్ర్య పరిరక్షణ కోసం గిరిజన సమాజం వందల ఏళ్ల పాటు పోరాటాన్ని నడిపిందన్నారు. గిరిజన సమాజం ప్రకృతిని, ప్రాచీన వైద్య విధానాలను సజీవంగా ఉంచిందన్నారు. గత ప్రభుత్వాలు వెనకబడిన వర్గాల సంక్షేమం గురించి ఎప్పుడూ ఆలోచించలేదని.. వారి అభివృద్ధి కోసం కృషి చేయలేదని ప్రధాని విమర్శించారు. సమాజానికి దూరంగా నివసిస్తున్న ఆదివాసీలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. వారు పండించే దాదాపు 90 అటవీ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఇచ్చామన్నారు. ఆదివాసీ యువత క్రీడలలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారని.. వారిని మరింత ప్రోత్సహించడానికి అనేక క్రీడా సౌకర్యాలను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఆదీవాసీలకు చదువు, సంపద, వైద్య సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. వారి సంక్షేమానికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటుచేశామని.. బడ్జెట్‌ను రూ.25,000 కోట్ల నుంచి రూ.1.25 లక్షల కోట్లకు పెంచామని ప్రధాని వెల్లడించారు.

# గత పాలనలో ఎక్కువే విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

పోస్టులు పెట్టారని దుయ్యబట్టారు. ఇదొక ఆర్గనైజ్డ్ క్రైమ్‌గా వర్ణించారు. వీరు మనుషులా.. జంతువులా? అంటూ ప్రశ్నించారు. సొంత పార్టీ నేతలపైనా కఠినంగా వ్యవహరిస్తామని సభ వేదికగా చెప్పారు. చట్టానికి పదును పెడతామన్నారు. ఇలాంటివాళ్లు రాష్ట్రంలో ఉండటానికి వీల్లేదన్నారు. ఆడబిడ్డల జోలికొచ్చినవారిని ఉక్కుపాదంతో వారిని అణిచివేస్తామన్నారు. ఒక్క ఛాన్స్ అంటూ రాష్ట్రాన్ని జగన్ ప్రభుత్వం సర్వనాశనం చేసిందన్నారు సీఎం చంద్రబాబు. అప్పటి ప్రభుత్వ జీవోలు, కాగ్ రిపోర్టులు సైతం బయట పెట్టలేదన్నారు. సింపుల్‌గా చెప్పాలంటే విభజన కంటే.. ఐదేళ్లలో నాశనం చేసిందే ఎక్కువన్నారు. శాసనసభలో బడ్జెట్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టు అని చెప్పినా వినలేదన్నారు ముఖ్యమంత్రి. అమరావతి గొప్ప నగరంగా తయారుకాకుండా అడ్డుకున్నారని చెప్పారు. పోలవరం ప్రాజెక్టుని దెబ్బతీశారని, నదులు అనుసంధానం అయితే రాష్ట్రంలో కరువు అనేది ఉండదన్నారు. వచ్చిన పెట్టుబడులను వైసీపీ ప్రభుత్వం తరిమేసిందని ఆందోళన వ్యక్తం చేశారు సీఎం చంద్రబాబు. బడ్జెట్‌పై సభలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలపై తనదైన శైలిలో రిప్లై ఇచ్చారు. ఆస్తులు సృష్టి లేదు.. సంపద లేదన్నారు. దీనివల్ల ఆదాయం తగ్గి, ఖర్చులు పెరిగాయన్నారు. అప్పులు తెచ్చి ఆస్తులు తాకట్టు పెట్టారని గుర్తు చేశారు. శాంతి భద్రతల విషయంలో ఏ మాత్రం రాజీ లేదన్నారు. రాజకీయ ముసుగులో నేరాలు చేయాలని భావిస్తే సహించేది లేదన్నారు. ప్రజలకు సెక్యూరిటీ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అసెంబ్లీకి నేతలు రాకపోవచ్చు.. ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అలాగే ప్రభుత్వం తీసుకొచ్చిన పాలసీల గురించి వివరించారు. కేంద్రం సహకారంతో అమరావతి, పోలవరం ప్రాజెక్టు పనులు మొదలవుతున్నాయని తెలిపారు. నదులు అనుసంధానం అయితే కరువు అనే మాట రాదన్నారు. దక్షిణాదిలో ఇదే ఫస్ట్ రాష్ట్రం అవుతుందన్నారు. రాష్ట్రాన్ని పెట్టుబడులు రప్పించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నామన్నారు సీఎం. తాను అన్నీ చేశామని చెప్పలేదన్న ముఖ్యమంత్రి, రాబోయే రోజుల్లో ఎలాంటి సమస్య ఉండదని పెట్టుబడుదారులకు భరోసా ఇచ్చామన్నారు. ఎప్పుడూ చూడని విధ్వంసం రాష్ట్రంలో చూశామని, వ్యవస్థలు నిర్వీర్యం అయ్యాయన్నారు సీఎం చంద్రబాబు. అన్నింటినీ గాడిలో పెడుతున్నామని వెల్లడించారు. ఆర్థిక స్థితిని గాడిలో పెట్టేందుకు చేయాల్సిన పనులు వేగంగా చేస్తున్నామని తెలిపారు. ఇది కేవలం ప్రారంభం మాత్రమేనన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో ఇదొక బెస్ట్ బడ్జెట్ అని, ఇది కేవలం కేంద్రం ద్వారానే సాధ్యమైందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు ఎలాంటి విఘాతం కలగకుండా చేసుకుంటూ వెళ్తున్నామని తెలిపారు. ప్రజలు కూడా అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు.మంచి ప్రభుత్వం- చెడు ప్రభుత్వం మధ్య తేడాను ప్రజలు గుర్తించాలన్నారు. సభ్యులు అన్నివిధాలుగా సహరిస్తున్నారని, సభ నిండుగా ఉందన్నారు. అలాగే డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును చూస్తే.. కుర్చీ కూడా కళకళలాడుతోందని నవ్వుతూ అన్నారు ముఖ్యమంత్రి. ఇదే వాతావరణం నిత్యం ఉండాలన్నారు.

# ఢిల్లీలో క్షీణించిన వాయు నాణ్యత

**న్యూఢిల్లీ, నవంబరు 15 :** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్ర స్థాయికి చేరింది. వాయు నాణ్యత అత్యంత దారుణంగా క్షీణించింది. మూడవ రోజు వరుసగా సీవియర్ కేటగిరీ నమోదు చేసింది. ప్రపంచంలో అత్యంత కలుషితమైన రెండవ నగరంగా ఢిల్లీ నిలిచింది. ఢిల్లీలో ఇవాళ ఉదయం ఏడు గంటలకు ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 498గా నమోదు అయ్యింది. పాకిస్థాన్‌లోని లాహోర్‌లో ఎయిర్ క్వాలిటీ 770గా రికార్డు అయ్యింది. ఢిల్లీ లోని జహం గిర్‌పురి, బవానా, వాజిర్పుర్, రోహిణి, పంజాబీ బాగ్ ప్రాంతాల్లో అత్యధిక స్థాయిలో కాలుష్యం నమోదు అయ్యింది. ఢిల్లీలోని పాలమ్, సఫ్దార్‌జంగ్‌లో 500ఎం, 400ఎం విజిబులిటీ నమోదు అయ్యింది. ఆతిషి ఇవాళ తన ఎక్స్ అకౌంట్‌లో ప్రకటన చేశారు.

# పతంజలికి యజమాని నేను కాదు..

(మొదటి పేజీ తరువాయి)

పతంజలి యోగపీఠ్‌లో సైక్లింగ్ చేస్తున్న ఆయన కంపెనీ యాజమాన్య హక్కులకు సంబంధించిన మొత్తం విషయాన్ని స్పష్టం చేశారు. ఈ సామ్రాజ్యం మొత్తం దేశ ప్రజలదేనని, వారే లబ్ధిదారులని అన్నారు. పతంజలి ఆస్తులపై కూడా కొందరికి చెడు చూపు ఉందన్నారు. స్వదేశీ కంపెనీ ప్రయాణం గురించి.. దాని సామ్రాజ్యం గురించి కూడా వివరించారు.లక్షల కోట్ల విలువైన ఈ పతంజలి సామ్రాజ్యం మొత్తం, ఇంత పెద్ద ఆచారం ఎలా వచ్చిందో, దాని యజమాని ఎవరు అని ప్రజల దృష్టిలో ఉందని రామ్‌దేవ్ అన్నారు. నిరామయం, యోగా గ్రామ్, పతంజలి యోగపీఠ్, పతంజలి గురుకులం, పతంజలి వెల్‌నెస్, యూనివర్సిటీ మొదలైన వందలాది సేవా సంస్థలను తాము నడుపుతున్నట్లు గుర్తుచేశారు. ఈ పనులతో పాటు, తాము ఈ ప్రచారాన్ని చాలా దూరం తీసుకెళ్లామని చెప్పారు. నేడు మనం దేశం మొత్తం మీద 100కి పైగా పెద్ద సంస్థలను స్థాపించినట్లు తెలిపారు. క్యాపిటల్ మార్కెట్‌లో దీని మొత్తం వాల్యుయేషన్ రూ. లక్ష కోట్ల కంటే ఎక్కువ ఉంటుందని వెల్లడించారు.మన యోగా గురువు సోదర సోదరీమణులు లక్షకు పైగా చోట్ల యోగాను ముందుకు తీసుకెళ్తున్నారని బాబా రామ్‌దేవ్ అన్నారు. ఇందులో ఇక్కడ కనీసం 10 లక్షల మందికి శిక్షణ ఇచ్చామని తెలిపారు. జిల్లా స్థాయిలో 20-25 లక్షల మందికి శిక్షణ ఇచ్చామన్నారు. నేడు కనీసం 25 లక్షలకు పైగా సీనియర్ యోగా ఉపాధ్యాయులు తమతో కలిసి సేవ చేస్తున్నారన్నారు. విద్యా బానిసత్వం, ఆర్థిక సైద్ధాంతిక బానిసత్వం నుంచి విముక్తి పొందడానికి తాము ఎన్నో ప్రయత్నాలు చేసినట్లు చెప్పుకొచ్చారు. లక్షల కోట్ల విలువైన ఈ సామ్రాజ్యం ఉద్భవించడానికి చాలా ప్రయత్నాలు జరిగాయన్నారు. పతంజలికి తాను లేదా ఆచార్య బాలకృష్ణ ఓనర్ అన్న మాటలను మరోసారి రామ్‌దేవ్ ఖండించారు. పతంజలి సామ్రాజ్యం గురించి సవివరమైన సమాచారం ఇస్తూ.. 'స్వామి రామ్‌దేవ్ దాని యజమాని కాదు.. ఆచార్య బాలకృష్ణ యజమాని కాదు.. దాని యజమాని మొత్తం దేశం, దాని ప్రజలు. ఈరోజు మనం చేసిన ఆరోగ్యం, విద్య, పేదరికం, ప్రకృతి, పరిశోధన, దానధర్మాలు, లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసి చేసిన కృషిని మొత్తం బేరీజు వేసుకుంటే ఈ ప్రయాణం ఇలాగే కొనసాగాలన్నదే ఏకైక లక్ష్యం. దీని నిర్వహణ వ్యయం రూ.200 కోట్లు.' అని చెప్పారు.

# రైతులను ఆదుకుంటాం

**న్యూఢిల్లీ,నవంబరు 15 :** మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ దూసుకుపోతుంది. అన్ని వర్గాల వారికి ఉపయోగపడేలా పథకాలు రచిస్తూ ముందుకు వెళుతోంది. ఆ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ సైతం మహారాష్ట్ర ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ మహారాష్ట్ర రైతులతో వీడియో కాల్ మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు తమ బాధలను రాహుల్ గాంధీకి చెప్పుకుని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రాహుల్ ఎన్నికల్లో గెలిపిస్తే పలు హామీలు అమలు చేస్తామని వారికి చెప్పారు. వచ్చే డబ్బులతో తమ బిడ్డలను ఏం చదివిస్తామో.. ఏం తిండి పెడతామో అర్థం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మహారాష్ట్ర రైతుల కోసం మహావికాస్ అఘాడీ కూటమి చారిత్రాత్మక అడుగులు వేస్తామని హామీ ఇచ్చారు. సోయాబీన్ కు క్వింటాలుకు రూ.7000 ఎంఎస్ ప్లస్ బోనస్ ఇస్తామని చెప్పారు. ఉల్లికి కూడా సరైన మద్దతు ధర నిర్ణయించేందుకు కమిటీ వేస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా పత్తికి కూడా మద్దతు ధర ఇచ్చి ఆ రైతులను సైతం ఆదుకుంటామని చెప్పారు. గత మూడు ఎన్నికలలో సోయాబీన్ కు రూ.6వేల రూపాయలు ఎంఎస్పీ ఇస్తామని బీజేపీ వాగ్దానం చేసిందని చెప్పారు. కానీ నేటికీ రైతులు తమ రక్తం, చెమటతో పండించిన సోయాబీన్ కు రూ.3వేల నుండి రూ.4వేల రూపాయలకు అమ్ముతున్నారని చెప్పారు.

# ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కార్తీక పౌర్ణమి

(మొదటి పేజీ తరువాయి)

నదీతీరాల్లో పుణ్యస్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. వేకవ జామునే నదీతీర ప్రాం తాల్లో పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. అటు శైవాలయాలు, ఇటు వైష్ణవాలయాలు కిటకిటలాడాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆధ్యాత్మిక శోభన సంతరించుకుంది, తెల్లవారుజాము నుంచే గోదావరి స్నానాలకు, శివాలయాలకు పోటెత్తారు భక్తులు. రాజమండ్రి పుష్కర్ ఘాట్ వద్ద గోదావరి పుణ్యస్నానా కోసం జల్లు స్నానాలను ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్తీక శుద్ధ పౌర్ణమి లేదా కార్తీక పున్నమి గా పిలవబడే కార్తీకమాసంలో శుక్లపక్షంలో పున్నమి తిథి దీపావళి పండగ వెళ్ళిన 15వ రోజు వస్తుంది. హిందువులు అత్యంత పరమ పవిత్రమైన కార్తీక మాసంలోని పౌర్ణమి తిథి కావడంతో శివాలయాలకు , శైవ వక్షేత్రాలైన ద్రాక్షారా మం, సామర్లకోట, పిఠాపురం పాదగయ, కోనసీమలో పలు పుణ్యక్షేత్రాలకు చేరుకుని పెద్ద ఎత్తున దీపాలు వెలిగించారు, మహాభారత కథనాన్ని అనుసరించి కార్తికేయుడు తార కరుని సంహరించిన రోజునే కార్తీక పౌర్ణంగా పిలుస్తారని పురాణాలు చెబుతున్నాయి. మహాశివరాత్రి తర్వాత శివుడికి అత్యంత ప్రీతికరమైన రోజుగా కార్తీకమాసం అంటారు. కార్తీక పౌర్ణమి రోజున చేసే నదీ స్నానం దీప దానం, శివాయల దర్శనం, విశేష పూజలు చేస్తే ఎంతో పుణ్యం ఫలమని నమ్మకం. ఈ నెల అంతా కార్తీక మహా పురాణాన్ని పారా యణం చేస్తారు. దేవాలయాలో కార్తీక పురాణ శ్రవణం ఏర్పాటు చేస్తే ఎంతో పుణ్యఫలం అని బ్రాహ్మణులు చెబుతున్నారు, వెయ్యిళ్ల రాక్షసుల పాలన అంతరించిన సందర్భంగా మహాశివుడు తాండవం చేశాడని పురాణాలు కూడా చెబుతున్నాయి. అందుకే కార్తీక పౌర్ణమి రోజు గోదావరి స్నానం నదీ స్నానమాచరించి శివుడికి ప్రత్యేక పూజలు చేయడానికి ఆలయాలకు క్యూ కట్టారు భక్తులు. శివాలయంలో 365 ఒత్తులతో కూడిన దీపాన్ని వెలిగిస్తే పుణ్యఫలం దక్కుతుందని నమ్మకం. దీంతో గోదావరి జిల్లాల్లోని ఆధ్యాత్మిక కేంద్రాలన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. ఇకపోతే విజయవాడ కృష్ణాఘాట్, విశాఖ బీచ్, శ్రీశైలం,శ్రీకాళహస్తి, తిరుపతిల్లో లక్షవల్లుతు వెలగించారు. స్వామికి అభిషేకాలు చేయించారు. కాళేశ్వరం, ధర్మపురి, బాసర గోదావరి తీరాల్లో భక్తులు పోటెత్తారు. ఉదయమే భక్తులు నదీస్నానాలు ఆచరించి పూజలు చేశారు. ఉసిరి దీపాలను వెలగించారు. అమరావతిలో కృష్ణమ్మ చెంత మహిళలు తెప్పలు వదిలారు. సూర్యలంక, చీరాల, చినగంజాం, పెదగంజాం సముద్ర తీరాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు స్నానమాచ రించారు. దక్షిణ కాశీగా పేరొందిన శ్రీశైలంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ద్రాక్షారామం, కోటప్పకొండ, శ్రీకాళహస్తి, మహానంది తదితర పుణ్యక్షేత్రాల్లో భక్తుల రద్దీ నెలకొంది.

# వివాహిత ఆత్మహత్య..

### అనాథలైన ఇద్దరు చిన్నారులు..



**బంటుమిల్లి,నవంబర్ 15 (ఆంధ్రపత్రిక):** మద్యం ఒక కుటుంబాన్ని వీధిన పడేసిన సంఘటన బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి గ్రామంలో జరిగింది. వివరాల్లోకెళ్తే, పెదతుమ్మిడి గ్రామా నికి చెందిన మేక నరేష్ తో, గుడ్లవల్లేరు మండలం డోకిపర్రు గ్రామానికి చెందిన గీత సంపూర్ణ (22)కు ఐదు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు పాపకు మూడు సంవత్సరాలు, బాబుకు సంవత్సరం వయసు. అయితే మేక నరేష్ స్థానికంగా ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తూ మద్యానికి బానిసై భార్యను వేధిస్తూ ఉండడంతో మనస్థాపానికి గురైన భార్య గీత సంపూర్ణ ది 13.11.2024వ తేదీ రాత్రి 12 గంటల సమయంలో పెదతుమ్మిడిలోని ఇంటిలో ఉరివేసుకునగా, చికిత్స నిమిత్తం విజయవాడ గవర్నమెంట్ హాస్పటల్ నందు జాయిన్ చేసినట్లు, అక్కడ చికిత్స పొందుతూ గీతా సంపూర్ణ చనిపోగా, ఆమెను భర్త, అత్త, మామ, మరిది వేధింపుల వలన ఉరివేసుకుని చనిపోయినట్లు ఆమె తల్లి కాగిత గాయత్రీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంటుమిల్లి ఎస్ఐ ఏ గణేష్ కుమార్ కేసు నమోదు చేయగా, పెడన సీఐ నాగేంద్రప్రసాద్ కేసును దర్యాప్తు చేస్తున్నారు. బంటుమిల్లి ఎమ్మార్వో శవ పంచనామా నిర్వహించారు. ఏది ఏమైనా మద్యం ఒక కుటుంబాన్ని బలి తీసుకుంది. తల్లి చనిపోగా, తండ్రి మీద కేసు నమోదు అవ్వగా ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలిపోయారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి...

# భారత స్వాతంత్ర్య సాధనలో గిరిజనుల పాత్ర ప్రశంసనీయం



**మైలవరం, నవంబర్ 15 (ఆంధ్రపత్రిక):** భారత దేశ స్వాతంత్ర సాధనలో గిరిజనుల పాత్ర ప్రశంసనీయమని మైలవరం తాసిల్దార్ జి బాల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. భారత ప్రభుత్వ గిరిజన మంత్రిత్వ శాఖ ఆదేశానుసారం ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు శ్రీ భగవాన్ బిర్సా మొండా 151 జయంతినీ పురస్కరించుకొని భారత గిరిజన దినోత్సవం (జన జాతీయ దివాస్) ను స్థానిక శ్రీ లీలావతి గిరిజన పాఠశాలలో శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తాసిల్దార్ మాట్లాడుతూ గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలు నేటి తరాలకు ఆదర్శప్రాయంగా ఉన్నాయ న్నారు. ఈ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న గిరిజనులు మంచి విద్యాబుద్ధులు నేర్చుకొని ఉన్నత స్థితిని అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలలో రాణించిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ పాఠశాలలోని విద్యార్థులు గిరిజన సాంప్రదాయకరమైన లంబాడి, గోండు వస్త్రధారణలతో నృత్య ప్రదర్శనలు గావించి అలరింపజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వుడతా లక్ష్మీనారాయణ శ్రీ భగవాన్ బిర్సా మొండా వేషధారణ తో అందరినీ ఆకట్టుకున్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులను యాజమాన్యం, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. గత 26 సంవత్సరాలుగా ఈ పాఠశాలలో పనిచేస్తున్న షేక్ సైదాబీ నీ తాసిల్దారు బాలకృష్ణారెడ్డి, యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి రాధాకుమారి, స్థానిక రెవెన్యూ సిబ్బంది, పుర ప్రముఖులు పాల్గొన్నారు.





కార్తీక పౌర్ణమి సందర్భంగా కృష్ణా నది ఒడ్డున ఉన్న దుర్గాఘాట్‌లో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు...





ఆంధ్రపత్రిక ఫొటోలు: సిహెచ్.విజయభాస్కర్





గిరిజన స్వాభిమాన్ ఉత్సవాలు-2024లో భాగంగా విజయవాడలో సంబరాలు చేస్తున్న గిరిజనులు...







- కార్తీక పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న మంత్రి నారా లోకేష్
- కాలినడకన వెళ్లి గండాల నరసింహస్వామి దర్శించుకున్న మంత్రి
- మొక్కులు తీర్చుకుని గండ దీపం వెలిగించిన మంత్రి లోకేష్

# కోటి దీపోత్సవంలో... జ్యోతి ప్రజ్వలన



**మంగళగిరి, నవంబర్ 15 (ఆంధ్రపత్రిక):** కార్తీక పౌర్ణమి వేడుకల్లో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ సందడి చేశారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని మంగళగిరిలోని దిగువన ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఉత్తర గాలి గోపురం వద్ద ఓంశ్రీ మణి ద్వీపం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కోటిదీపోత్సవంలో పాల్గొని అఖండ కోటి దీపం వెలిగించారు. ముందుగా కోటిదీపోత్సవంలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రికి పండితులు ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి నారా లోకేష్ పానకాల లక్ష్మీనరసింహ ఆలయానికి చేరుకుని అక్కడి నుంచి మెట్లమార్గంలో కాలినడకన వెళ్లి కొండ శిఖరాగ్రాన కొలువై ఉన్న గండాలయ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. మొక్కులు



తీర్చుకుని గండ దీపాన్ని వెలిగించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. గండాలయ స్వామి కొండకు మంత్రి నారా లోకేష్ రాకను పురస్కరించుకుని పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా శుక్రవారం స్వాగతం పలికిన ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి..

# సంక్రాంతికి డాకు మహారాజ్



- గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ 'ఎన్‌బికె109' సినిమా టైటిల్, టీజర్ విడుదల
- చిత్రానికి 'డాకు మహారాజ్' టైటిల్
- సంక్రాంతి కానుకగా 2025, జనవరి 12న సినిమా విడుదల

**విజయవాడ,నవంబరు 15(ఆంధ్రపత్రిక):** నందమూరి అభిమానులతో పాటు, తెలుగు సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురుచూస్తున్న చిత్రం 'ఎన్‌బికె109'. హ్యాట్రిక్ విజయాలతో దూసుకుపోతున్న గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న 109వ చిత్రమిది. తన నటవిశ్వరూపంతో ఐదు దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తున్న బాలకృష్ణ, మరో అద్భుతమైన చిత్రంతో అలరించడానికి సిద్ధమవుతున్నారు. బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్‌ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. అందరూ ఎంతగానో ఎదుచూస్తున్న ఈ చిత్ర టైటిల్ టీజర్ విడుదలైంది. కార్తీక పూర్ణిమ శుభ సందర్భంగా చిత్ర టైటిల్‌ని ప్రకటించడంతో పాటు, టీజర్‌ను విడుదల చేశారు నిర్మాతలు. ఈ సినిమాకి 'డాకు మహారాజ్' అనే శక్తివంతమైన టైటిల్‌ను పెట్టారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని ఏఎంబీ మాల్‌లో 'ఎన్‌బికె109' టీజర్ విడుదల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు దర్శకుడు బాబీ కొల్లి, నిర్మాత సూర్యదేవర నాగవంశీ, సంగీత దర్శకుడు ఎస్.తమన్ హాజరయ్యారు. 96 సెకన్ల నిడివితో రూపొందిన 'డాకు మహారాజ్' టీజర్, టైటిల్‌కి తగ్గట్టుగానే అద్భుతంగా ఉంది. "ఈ కథ రాజ్యం లేకుండా యుద్ధం చేసిన ఒక రాజుది, గండ్ర గొడ్డలి పట్టిన యమధర్మ రాజుది, మరణాన్ని వణికించిన మహారాజుది" అంటూ 'డాకు మహారాజ్'గా బాలకృష్ణను పరిచయం చేసిన తీరు అదిరిపోయింది.తమన్ నేపథ్య సంగీతం టీజర్ ని మరోస్థాయికి తీసుకెళ్లింది. మొత్తానికి టీజర్ చూస్తుంటే, బాలకృష్ణతో కలిసి దర్శకుడు బాబీ థియేటర్ల లో ప్రేక్షకులను సరికొత్త అనుభూతిని అందించే భారీ యాక్షన్ ఎంటర్టైనర్ ను అందించడబోతున్నారని అర్థమవుతోంది. టీజర్ విడుదల కార్యక్రమంలో దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ, " టీజర్ మీ అందరికీ నచ్చిందని భావిస్తున్నాను. మీరు చూసిన టీజర్‌లో డూపులు లేవు, డూప్లికేట్‌లు లేవు. బాలకృష్ణ గారే అన్నీ నిజంగా చేశారు. గుర్రం ఎక్కింది ఆయనే, నడిపింది ఆయనే, యుద్ధానికి వచ్చేది కూడా ఆయనే. మీరు చూసినవన్నీ ఒరిజినల్ షాట్స్. తమన్ గారు అద్భుతమైన సంగీతం అందిం చారు. నేనైనా, నాగవంశీ గారైనా దీనిని ఎప్పుడూ సాధారణ సినిమాలా చూడలేదు. బాలయ్య గారు సృష్టిస్తున్న రికార్డుల ను దృష్టిలో పెట్టుకొని, కేవలం మాస్ లోనే కాకుండా అన్ని వర్గాలలో ఆయనకు ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకొని, ఎప్పుడూ చూడని కొత్త బాలకృష్ణని చూపించాలని, సినిమా మొదటి నుంచి ఎంతో శ్రద్ధతో పని చేస్తూ వచ్చాము. యుద్ధం గట్టిగా ఉండబోతుంది" అన్నారు. నిర్మాత సూర్యదే వర నాగవంశీ మాట్లాడుతూ, "బాలకృష్ణని చాలా కొత్తగా చూపించాలని నేను, దర్శకుడు బాబీ ముందు నుంచి అనుకుంటున్నాం. టీజర్‌లో మీరు చూసింది చాలా చిన్నది. సినిమాలో ఇలాంటివి ఎన్నో ఉన్నాయి అన్నారు. దర్శకుడు ఎస్. తమన్ మాట్లాడుతూ, "బాబీ చాలా గొప్ప సినిమా తీశారు. బాలయ్య తో ఇది నా ఐదవ సినిమా. ఆయనతో పని చేయడం సంతోషంగా ఉంది. సినిమా ఏదైతే కోరుకుంటుందో, దానికి తగ్గట్టుగా సంగీతం అందిస్తున్నాను. ఈ సినిమా అద్భుతంగా ఉంటుంది." అన్నారు. 'డాకు మహారాజ్' చిత్రం సంక్రాంతి కానుకగా 2025, జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. ప్రముఖ బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రముఖ ఛాయాగ్రాహకుడు విజయ్ కార్తీక్ కన్నన్ కెమెరా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కళా దర్శకుడిగా అవినాష్ కొల్లా, ఎడిటర్‌గా నిరంజన్ దేవరమానే వ్యవహరిస్తున్నారు.

## శ్రీవారికి 15 ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు విరాళం





**తిరుమల, నవంబర్ 15 (ఆంధ్రపత్రిక):** తిరుమల శ్రీవారికి హైదరాబాద్‌కు చెందిన పెరల్ మినిరల్స్ అండ్ మైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ సి.వెంకట నాగరాజ శుక్రవారం 15 టీవీఎస్ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను విరాళంగా అందించారు.ముందుగా అలయం వద్ద ఈ వాహనాలకు జరిగిన పూజలో టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్ వెంకయ్య చౌదరి పాల్గొన్నారు. అనంతరం దాత వారికి వాహనాల తాళాలను అందజేశారు. ఈ వాహనాల ధర దాదాపు రూ.22 లక్షలు అని దాత తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో లోకనాథం, వీజీవో సురేంద్ర, తిరుమల డీఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రంలో ఆయుధపూజ



**తిరుమల, నవంబర్ 15 (ఆంధ్రపత్రిక):** తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్స్‌లో శుక్రవారం ఆయుధ పూజ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి పాల్గొన్నారు. ముందుగా వేద మంత్రోచ్ఛారణ మధ్య శ్రీ పద్మావతి, శ్రీ వేంకటేశ్వరుని చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాదాల తయారీకి వినియోగించే యంత్రాలు, పాత్రలకు పూజలు చేశారు. అనంతరం అన్నదానం సిబ్బందిని అడిషనల్ ఈవో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు రాజేంద్ర, ఆశాజ్యోతి, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి, ఇతర కార్యాలయ సిబ్బంది, క్యాటరింగ్ సిబ్బంది, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

## గత ఐదేళ్లలో అరాచక పాలన



ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్

**అమరావతి, నవంబరు 15 (ఆంధ్రపత్రిక):** నేరస్తులు అధికారంలోకి వస్తే ఏలా పాలన ఉంటుందో గత పాలనలో చూశామని ఏపీ డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అన్నారు. దురదృష్టవశాత్తు 2019లో నేరస్తులు అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. గత ప్రభుత్వం రాజకీయాలను నేరమయం చేసిందని విమర్శించారు.నేరస్థులు అధికారంలోకి వస్తే ఏం జరుగుతుందో మొన్నటి వరకు చూశామని పేర్కొన్నారు. క్రిమినల్స్ మైంట్‌సెట్‌తో ఉన్న వ్యక్తులు అధికారంలోకి వస్తే రాజ్యాంగానికి గౌరవం ఇవ్వరని విమర్శించారు. సొంతపార్టీ ఎంపీని కూడా దారుణంగా హింసించిన చరిత్ర గత పాలకులదని అన్నారు.

## సూపర్ స్టార్ కృష్ణ 2వ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు

వృద్ధులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ



**గవర్నర్‌పేట, నవంబరు 15 (ఆంధ్రపత్రిక):** ఐదు దశాబ్దాల సినీ జీవితంలో నటుడు, నిర్మాత, దర్శకుడు, రచయితగా వెలుగొందిన సూపర్ స్టార్, నటశేఖర కృష్ణ రెండవ వర్ధంతి కార్యక్రమాన్ని నగర వ్యాప్తంగా కృష్ణ అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఆలిండియా సూపర్ స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ రాష్ట్ర అద్యక్షుడు కె.సుధాస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డినాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో అభిమానులు వృద్ధులు, మహిళలకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. బాబా మందిరంలో అభిమానులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుధాస్వామి నేతృత్వంలో అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో కృష్ణ ఫ్యాన్స్ సభ్యులు కె.విజయ్, శ్రీరాజ్, నర్రా జగన్మోహనరావు, బాబూరావు, టైలర్, ధనుంజయ్, అనీల్, ప్రేమ్, పండు, అన్నమయ్య తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by KANCHARLA RAMAIAH on behalf of Nageswara Rao Estates Private Limited,Printed at Jagati Publications Limited, Sakshi Press, SY.No.481, Phase-2, Jawahar Autonagar, Vijayawada-520007 Andhra Pradesh, and Published from D.NO.29-28-34, Dasari vari street, Suryaraopeta,Vijayawada-520002, KRISHNA DISTRICT-ANDHRA PRADESH, Editor : KANCHARLA RAMAIAH. Excutive editor V.VIJAYALAKSHMI. RNI no. 10721/65 Mobile:9849998069, Email:andhrapatrikadaily@gmail.com